పేజీలు :12
వేల :5/-

జాతీయ తెలుగు దినపత్రిక www.mediatodaydaily.com

# మీడియా టుడే

మన మీడియా - మన సమాజం

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Rajamandri, Chittur, Visakhapatnam prakasham

సంపుటి : 01 | సంచిక : 143 | ఆదివారం 8-3-2026 | పేజీలు 12 | వేల 5/-

## బెంగాల్‌లో రాష్ట్రపతి పర్యటన వివాదాస్పదం

- సీఎం కలవలేదని ముర్ము అసంతృప్తి
- రాష్ట్రపతిని అవమానించారు: మోదీ



**కోల్‌కతా, మార్చి 7: మీడియా టుడే**
రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం పశ్చిమ బెంగాల్‌లో జరిపిన పర్యటన వివాదాస్ప దమయింది. తనను కలవడానికి ముఖ్యమంత్రి గానీ, ఇతర మంత్రులుగానీ రాలేదని రాష్ట్రపతి అసంతృప్తి వ్యక్తం చేయగా, ఆమె బీజేపీ వారు చెప్పినట్టు మాట్లాడుతున్నారని మమతా బెనర్జీ ఆరోపించారు. డార్జిలింగ్ జిల్లాలో ఏర్పాటు చేసిన 9వ అంతర్జాతీయ సంతాల్ సమ్మేళనాన్ని ప్రారంభించేందుకు ఆమె రాష్ట్రానికి వచ్చారు. అయితే ఇరుకుగా ఉందన్న కారణంతో చివరి నిమిషంలో సమావేశ స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం మార్చివేసిందని రాష్ట్రపతి అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను ఆ స్థలాన్ని చూశానని, అక్కడ అయిదు లక్షల మంది కూర్చోవచ్చని చెప్పారు. 'ఇది చాలా విచారకరం' అని వ్యాఖ్యానించారు. సమావేశాన్ని బిధాన్‌నగర్ నుంచి గోసాయిపూర్‌కు మార్చడాన్ని తప్పుపట్టారు. దీనిపై ప్రధాని మోదీ స్పందిస్తూ ఇలాంటి పరిణామాలు గతంలో ఎప్పుడూ జరగలేదని అన్నారు. సిగ్గుచేటని విమర్శించారు. ప్రజాస్వామ్యం. గిరిజనుల సాధికారితపై విశ్వాసం ఉన్నవారు నిరాశ చెందారని వ్యాఖ్యానించారు. గిరిజన జాతికి చెందిన రాష్ట్రపతికి బాధ కలిగించడంపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని అన్నారు. తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని హద్దులను దాటిందని, రాష్ట్రపతిని అగౌరవ పరిచిందన్నారు. రాష్ట్రపతి ముర్ము వ్యాఖ్యలపై మమతా బెనర్జీ స్పందించారు. కోల్‌కతాలో ఆమె మాట్లాడుతూ బీజేపీ సలహాల మేరకు ఆమె మాట్లాడుతున్నారని అన్నారు. మణిపూర్, ఛత్తీసగఢ్‌లలో గిరిజనులపై అత్యాచారాలు జరిగినా ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఆమెను ఆహ్వానించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎవరూ వెళ్లలేదనడం సరికాదని చెప్పారు. "ఆ సమావేశాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడం లేదు. దానిని ఎవరు నిర్వహిస్తున్నారో, నిధులు ఎవరు ఇచ్చారో కూడా తెలియదు" అని మమత వ్యాఖ్యానించారు. "సంవత్సరానికి ఒకసారి వస్తే వెంట నేనుంటా. కానీ పదేపదే వస్తున్నారు. ప్రతి సారీ ఎలా వెళ్లగలను? గాలిపటం ఎగురవేస్తుంటే మాంజా పట్టుకొని తిరుగుతున్నట్టు తిరగలేం కాదా" అని వ్యాఖ్యానించారు.

# గణపతీ లొంగిపొండి!

## పూర్తిగా ఉచిత వైద్య చికిత్స అందిస్తాం

**మిగిలిన మావోయిస్టులంతా జనంలోకి రావాలి**
**లొంగిపోయిన వారికి ఇల్లు, ఆరోగ్య భద్రత కార్డు**
**ఆత్మగౌరవంతో బతికే వాతావరణం కల్పిస్తాం**
**కేసుల ఎత్తివేతపై ఉన్నతస్థాయి కమిటీ వేస్తాం**
**తెలంగాణ పునర్నిర్మాణంలో భాగం కండి**
**రాజకీయాల్లోకి వస్తే సంతోషం: రేవంత్‌రెడ్డి**
**సీఎం ముందు 130 మంది నక్సల్స్ లొంగుబాటు**



**హైదరాబాద్, మార్చి 7 మీడియా టుడే**
అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న మావోయిస్టు అగ్రనేత గణపతి లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. లొంగిపోతే ఆయనకు అవసరమైన అన్ని రకాల వైద్య చికిత్సలనూ ఉచితంగా అందిస్తామని ప్రకటించారు. నక్సలైట్ల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సానుభూతితో ఉందని చెప్పారు. వారిపై కేసుల తీవ్రతను పరిశీలించి వేటిని ఎత్తేయవచ్చో నిర్ణయించడానికి ఉన్నత స్థాయి కమిటీని వేస్తున్నట్లు ప్రకటించారు. మావోయిస్టు పార్టీకి చెందిన 130 మంది మావోయిస్టులు శనివారం ముఖ్యమంత్రి సమక్షంలో లొంగిపోయారు. అత్యంత అధునాతనమైన 124 ఆయుధాలు, వేలకొద్దీ తూటాలను పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఇంత భారీ ఎత్తున ఆయుధాలతో మావోయిస్టులు లొంగిపోయిన ఘటన దేశంలోనే తొలిసారని అన్నారు. అటు పోలీసులు కానీ, ఇటు మావోయిస్టులు కానీ ప్రాణం కోల్పోవడం తమ ప్రభుత్వానికి ఇష్టం లేదని, అందుకే మావోయిస్టు అగ్రనేత సహా తెలంగాణకు సంబంధించిన మిగిలిన ఏడుగురు మావోయిస్టు నాయకులు లొంగిపోవాలని పిలుపునిచ్చారు. లొంగిపోయిన మావోయిస్టుల పునరావాసానికి తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇవ్వడంతోనే మావోయిస్టు అగ్రనేతలు దేవ్‌జీ, రాజిరెడ్డి, దామోదర్, గంగన్న తదితరులు లొంగిపోయారని చెప్పారు. జనజీవన స్రవంతిలోకి వచ్చిన మావోయిస్టులు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న విషయం తన దృష్టికి వచ్చిందని, వారి కోసం నిమ్స్ లాంటి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులతో పాటు ఇతర ఆసుపత్రుల్లో ఉచితంగా చికిత్స పొందేలా ఆరోగ్య భద్రత కార్డులను ఇస్తామని చెప్పారు. లొంగిపోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని ప్రకటించారు. అయితే, వారి కోరినట్లు వ్యవసాయానికి భూములు ఇవ్వలేమని స్పష్టం చేశారు. లొంగిపోయిన మావోయిస్టులు ఆత్మగౌరవంతో బతికే విధంగా కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఇతర రాష్ట్రాల వారు వచ్చినా లొంగుబాటుకు ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. నమ్మిన సిద్ధాంతం పోరాటాలు చేసిన మావోయిస్టులు ఇక ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని రావాలని, తెలంగాణ పునర్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. నక్సలైట్ పార్టీలో పనిచేసిన సీతక్క మంత్రి అయ్యారని, మాజీ మావోయిస్టులు వివిధ పదవుల్లో ఉన్నారని ప్రస్తావించారు. లొంగిపోయిన వారు కాంగ్రెస్ పార్టీలో చేరదలచుకుంటే గాంధీభవన్‌కు వెళ్లి పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కలవాలని సూచించారు. అలా వచ్చే వారికి పార్టీ స్వాగతం చెబుతుందన్నారు. మావోయిస్టులే బయటకు వచ్చాక ఆ పార్టీపై నిషేధం ఉన్నా లేకున్నా ఒకటేనని, ఆయుధాలు పట్టిన వారి కోసమే ఈ నిషేధమని చెప్పారు.

# ఏఐ కేరాఫ్ ఏపీ..

**అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ**
**ఈ ఏడాది చివరకల్లా తొలి 'కంప్యూటరు'**
**అమరావతిలో గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్**
**'రైసినా డైలాగ్'లో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన**




**న్యూఢిల్లీ, మార్చి 7 మీడియా టుడే**
రాబోయే కాలంలో ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ గమ్యస్థానం ఏపీయేనని ముఖ్యమంత్రి చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. సిలికాన్ వ్యాలీ తరహాలో భవిష్యత్తులో ప్రజలు క్వాంటమ్ వ్యాలీ గురించి, దానికి కేంద్రంగా మారుతున్న అమరావతిని గురించి మాట్లాడుకుంటారన్నారు. అనేక దేశాల అభివృద్ధిలో భారతీయుల పాత్ర ఉందని తెలిపారు. గతంలో భారత్ నుంచి మేధో వలస జరిగిందని, త్వరలో రివర్స్ మైగ్రేషన్ మొదలవుతుందని వ్యాఖ్యానించారు. విదేశీ వ్యవహారాల శాఖ-అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరుగుతున్న 'రైసినా డైలాగ్ -2026' సదస్సుకు సీఎం చంద్రబాబు హాజరయ్యారు. ఈ సదస్సుకు ఓ రాష్ట్ర ముఖ్యమంత్రిని నిర్వహకులు ఆహ్వానించడం ఇదే తొలిసారి. 'సాంకేతికత-సుపరిపాలన-భవిష్యత్తు' అనే అంశంపై సీఎం మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో క్వాంటమ్ కంప్యూటింగ్ అభివృద్ధి చెందుతోందని, భవిష్యత్తులో దీనివల్ల అనేక మార్పులు రానున్నాయని చంద్రబాబు తెలిపారు. ఈ ప్రాజెక్టు ఇప్పటికే అమరావతిలో ప్రారంభమైందని, త్వరలోనే అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఇప్పటికే ఒక క్వాంటమ్ కంప్యూటర్‌ను స్థాపించినట్లు, ఈ ఏడాది చివరికల్లా కార్యకలాపాలు ప్రారంభమవుతాయని చెప్పారు. తాము క్వాంటమ్ కంప్యూటర్లను తయారు చేసి ప్రపంచానికి సరఫరా చేయబోతున్నట్లు చెప్పారు. అమరావతిలో 'గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్'ను ప్రారంభిస్తున్నామని సీఎం చెప్పారు. భారత పరిశ్రమల సమాఖ్యతో కలసి ఏపీ ప్రభుత్వం పనిచేస్తోందని ఇప్పటికే భూమిని కేటాయించామని చెప్పారు. దావోస్ ఎలాగైతే ఒక ఎకనామిక్ ఫోరమ్ (ఆర్థిక వేదిక)గా ఉందో, అమరావతిని అలాగే 'లీడర్‌షిప్ ఫోరమ్'గా మార్చబోతున్నామని చంద్రబాబు వివరించారు.

**అభివృద్ధి, సాంకేతికతలో దూకుడు..**
"భారత్ శరవేగంగా అభివృద్ధి, సాంకేతికత వైపు దూసుకుపోతోంది. నాలెడ్జ్ ఎకానమీలో మనం ప్రపంచానికి నాయకత్వం వహిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లలో సుమారు 57-60 శాతం భారత్‌లోనే ఉన్నాయి. హైదరాబాద్ ఇప్పుడు నాలెడ్జ్ ఎకానమీగా ఎదగడం మనకు గర్వకారణం. రాష్ట్ర విభజన తర్వాత అమరావతిని నిర్మిస్తున్నా. ఇది అత్యంత అందమైన నగరాలలో ఒకటిగా ఉండనుంది. ప్రపంచంలోని ప్రతి వ్యక్తీ దీని గురించి మాట్లాడుకుంటారు. హైదరాబాద్ 'బ్రౌన్ ఫీల్డ్' నగరమైతే, అమరావతి 'గ్రీన్ ఫీల్డ్' నగరం. అన్ని సౌకర్యాలు భూగర్భంలో ఉండేలా డక్ట్స్ నిర్మిస్తున్నాం. ప్రతిదీ సాంకేతికతను ఉపయోగించి అత్యంత సమర్థవంతంగా చేస్తున్నాం. టెక్నాలజీని, ఇన్‌ఫ్రాను మిళితం చేసి కాలుష్య రహిత నగరంగా అమరావతిని నిర్మిస్తున్నాం. ఎవరైనా ఎక్కు వ కాలం జీవించాలని అనుకుంటే అమరావతికి రావా లి. విభిన్నంగా ఆలోచించేవారి కోసం అమరావతిలో క్రియేటివ్ సిటీని, ఓ స్పేస్ సిటీని, డ్రోన్ సిటీని ఏర్పా టు చేస్తున్నాం."

**సేవలో మనవాళ్లు అత్యుత్తమ దౌత్యవేత్తలు**
"భారతీయులు ఎక్కడ నివసించినా, ఎక్కడ పనిచేసినా స్థానిక సమాజంతో సులభంగా కలిసిపోతారు. అందువల్లే వారు ప్రపంచంలోనే అత్యుత్తమ దౌత్యవేత్తలు. గతంలో ఆంధ్రప్రదేశ్ నుంచి వలసలు కేవలం అమెరికా లేదా కొన్ని దేశాలకే పరిమితమయ్యేవి. కానీ నేడు తెలుగువారు, భారతీయులు అన్ని దేశాల్లోనూ ఉన్నారు. భారతీయులు తమ అనుకూలత, స్నేహపూర్వక స్వభావం, ప్రపంచ సంక్షేమం పట్ల నిబద్ధతతో మంచి పేరు తెచ్చుకున్నారు. భారతీయ సాంకేతిక నిపుణులు ప్రపంచాభివృద్ధిలో, అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు." అని సీఎం తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అన్ని రకాల సాంకేతికతలలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. టెక్నాలజీ ద్వారా భవిష్యత్తులో మనం మెరుగైన సేవలు అందించడమే కాకుండా, బలమైన ఆర్థిక వ్యవస్థను కూడా సృష్టించగలమని వెల్లడించారు. "ఐటీ నుంచి ఏఐ వైపు మనం అడుగులు వేస్తున్నాం. భవిష్యత్తును ఏఐ పూర్తిగా మార్చేయబోతోంది. రాబోయే కాలంలో ప్రతి వ్యక్తి దైనందిన జీవితంలో ఏఐ కీలకం కానుంది. ఇప్పుడు డేటా సెంటర్లు ముఖ్యం. డేటానే సంపద. ఏఐ, క్వాంటమ్ కంప్యూటర్ల ద్వారా ఈ డేటాను ఎలా వినియోగించుకుంటామనేది ఆ దేశం, వ్యక్తి లేదా రాష్ట్ర ప్రభుత్వాల సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. ఏపీలో గూగుల్ సంస్థ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో డేటా సెంటర్‌ను, ఏఐ రంగాన్ని ఏర్పాటు చేస్తోంది. దేశంలో ఆర్థిక సంస్కరణల తర్వాత ఇటీవలి కాలంలో ఇదే అతి పెద్ద పెట్టుబడి. త్వరలో డేటా సెంటర్ల కోసం గ్రీన్ ఎనర్జీని పెద్ద ఎత్తున ఉత్పత్తి చేస్తున్నాం. భారత్‌లో ప్రస్తుతం సింగిల్ గ్రిడ్ ద్వారా ఎనర్జీ ట్రాన్స్‌ఫర్మేషన్ జరుగుతోంది.

## 3 విడతల రైతు బంధుకు ఎగనామం: హరీశ్

**గంగాధర, మార్చి 7 మీడియా టుడే**




ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు మూడు విడతల రైతు బంధు డబ్బులకు ఎగనామం పెట్టారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గోపాల్‌రావుపల్లిలో ఎండిన పంటలు, వరద కాలువను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. తోటపల్లి రిజర్వాయర్ నుంచి మానకొండూర్‌కు కాళేశ్వరం జలాలను అందించింది బీఆర్ఎస్ ప్రభుత్వమని చెప్పారు. కాలువల్లో తుంగ, మట్టి తొలగించక, ఇతర మరమ్మతులు చేయకపోవడంతో సాగునీరందక పొలాలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం నీటితో పంటలు పండుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరం లేనేలేదని చిల్లర మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్క చెరువు, చెక్‌డ్యాం, ప్రాజెక్టును కట్టిందిలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో పంటలు పండటం, హైదరాబాద్ వాసులతో పాటు కోటి మందికి తాగునీరు అందడం నిజమన్నారు. లక్షలాది ఎకరాలకు యాసంగిలో సాగునీరందుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా పదివేల ఎకరాలకు సాగునీరందించినట్లు చూపించగలరా..? అని సవాల్ విసిరారు.

## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

**సీపీఎస్‌ను రద్దు చేయాలి**
**ఎమ్మెల్సీలు మల్క కొమరయ్య, ఏవీఎన్ రెడ్డి**

**కవాడిగూడ, మార్చి 7 మీడియా టుడే**




నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని.. సీపీఎస్ వద్దు, ఓపీఎస్ ముద్దు అని పలువురు వక్తలు అన్నారు. 2004 సెప్టెంబరు 1కి ముందు విడుదలైన నోటిఫికేషన్లలో నియమితులైన ఉద్యోగులు, ఉపాధ్యాయులను సీపీఎస్ విధానం నుంచి మినహాయించాలని వారు డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కువద్ద '2003 ఉద్యోగ ఉపాధ్యాయ పాత పెన్షన్ పోరాట సమితి' తెలంగాణ రాష్ట్రం ఆధ్వర్యంలో మహా విజ్ఞాపన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004 సెప్టెంబరు ఒకటికి ముందు నోటిఫికేషన్లు విడుదలై నియామక ప్రక్రియ ఆలస్యం కావడం వల్ల కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సీపీఎ?స)లో కొనసాగుతున్న ఉద్యోగ ఉపా?ధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సభకు ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీలు మల్కకొమరయ్య, ఏవీఎన్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివ్ష?సగౌడ్ తదితరులు హాజరయ్యారు. ఎమ్మెల్సీ మల్క కొమరయ్య మాట్లాడుతూ ఉపా?ధ్యాయులు, పెన్షనర్ల న్యాయమైన సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకె ళ్తానన్నారు. ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. జాజుల శ్రీనివ్ష?సగౌడ్ మాట్లాడుతూ 2003 ఉద్యోగ ఉపాధ్యాయులు చేస్తున్న పోరాటానికి బీసీ సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి మాట్లాడుతూ 2003లో నోటిఫికేషన్ వచ్చి 2005లో నియామకమైన పదివేల మందికి ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# ఖజానాపై అదనపు బండ!

**గ్యాస్ సిలిండర్ ధర పెంపుతో భారం**
**రాష్ట్రంలో 500కే సిలిండర్ పథకం అమలు**
**మిగిలినది సబ్సిడీగా ఇస్తున్న సర్కారు**
**ఇందుకు నెలకు 100 కోట్ల చొప్పున భారం**
**సిలిండర్‌పై 60 పెంపుతో రాష్ట్ర ఖజానాపై..15-20 కోట్లు అదనంగా పడనున్న భారం**
**ఐదు నెలలుగా సబ్సిడీ చెల్లించని సర్కారు**



**హైదరాబాద్, మార్చి 7 మీడియా టుడే**
పశ్చిమాసియాలో రాజుకున్న యుద్ధం.. రాష్ట్ర ఖజానాపై భారం మోపుతోంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధరను పెంచడం రాష్ట్ర ప్రభుత్వానికి భారంగా పరిణమించింది. గృహ వినియోగ సిలిండర్‌పై ఒకేసారి రూ.60 పెంచడం.. రాష్ట్ర ప్రభుత్వ 'రూ.500కే గ్యాస్ సిలిండర్' పథకానికి శరాఘాతంగా మారింది. సిలిండర్ ధర పెరగడంతో రాష్ట్ర ఖజానాపై నెలకు అదనంగా రూ.15-20 కోట్ల భారం పడనుంది. ఈ పథకం అమలు కోసం ప్రస్తుతం నెలకు సుమారు రూ.100 కోట్లు అవుతుండగా.. ఇకపై ఈ భారం రూ.120 కోట్ల వరకు పెరగనుంది. పేద వర్గాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత తమ ఆరు గ్యారంటీల్లో భాగమైన 'మహాలక్ష్మి' పథకం కింద ఈ రూ.500కే ఎల్‌పీజీ సిలిండర్ పంపిణీని ప్రారంభించింది. అయితే 2024 ఫిబ్రవరి 27న దీనిని ప్రారంభించిన సందర్భంగా అప్పట్లో గ్యాస్ సిలిండర్ ధర రూ.825 ఉండేది. ఇందులో కేంద్ర ప్రభుత్వ పథకమైన 'ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన' కింద రూ.47.50 సబ్సిడీ సొమ్ము పేదల ఖాతాల్లో చేరుతోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా తన మహాలక్ష్మి పథకం కింద రూ.327.50ను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసేది. ఇలా రూ.375 సబ్సిడీ రూపంలో లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యేవి. 'మహాలక్ష్మి' పథకం కింద రాష్ట్రంలో 39 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో ప్రతినెలా కనీసం 25 లక్షల మంది అయినా సిలిండర్లను బుక్ చేస్తుంటారు. ఈ లెక్కన ప్రతినెలా రూ.100 కోట్ల వరకు సొమ్మును లబ్ధిదారుల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం జమ చేయాల్సి ఉంటుంది. తాజాగా సిలిండర్‌పై రూ.60 పెరగడంతో ఈ నెలవారీ భారం రూ.115-120 కోట్లకు చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సబ్సిడీ భారం పెరిగిన మాట అటుంచితే.. అసలు ఐదు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ సొమ్మును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయడం లేదు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా సకాలంలో ఖాతాల్లో వేయలేకపోతోంది.

# జై భీమ్ దీక్ష చేపట్టడం గర్వకారణం

## జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్ సైదులు



( మీడియా టుడే గరిడేపల్లి )

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనలను ఆశయాలను అనుసరిస్తూ ముందుకు తీసుకెళ్తూ భారత రాజ్యాంగం గొప్పతనాన్ని చాటుతూ జై భీమ్ దీక్ష చేపట్టడం గర్వకారణం అని తెలంగాణ మాదిగ జెఏసి సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్ సైదులు అన్నారు. ఈరోజు గరిడేపల్లి మండల కేంద్రంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద పొనుగోడు గ్రామానికి చెందిన నందిపాటి నరహరి అంబేద్కర్ కి ఎంఆర్పీఎస్ గరిడేపల్లి మండల అధ్యక్షులు కొత్తపల్లి రవి నీలి కండువా కప్పి అంబేద్కర్ దీక్ష మాలను స్వీకరింప చేశారు. మానవ హక్కుల కోసం అంబేద్కర్ పోరాటం చేసి అందరికీ సమన్యాయం కల్పించేలా కృషి చేశారన్నారు.దళిత జాతి ఉద్ధరణ కోసం పాటుపడరన్నారు. 18 సంవత్సరాల నిండిన అందరికీ ఓటు హక్కు కల్పించడమే కాకుండా మహిళలు మరియు కార్మికుల కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పిడమర్తి అంజి, తెలంగాణ సంస్కృతి సంఘం నాయకులు కోట వీరస్వామి, స్ఫూర్తి యువజన సంఘం అధ్యక్షుడు అనంతు కర్ణాకర్ గౌడ్, జై భారత్ జిల్లా నాయకులు రణపంగా శ్రవణ్, వార్డు మెంబర్లు నకిరేకంటి రమేష్, రామ్ మధు, నాయకులు కీసరి నాగయ్య, పాతకోటి లింగారెడ్డి, నందిపాటి రమేష్, మేదారి రాంబాబు, పిట్ట నర్సయ్య, పందిరి చంటి, తదితరులు పాల్గొన్నారు

# ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో ఉచిత వైద్య శిబిరాలు ప్రారంభం

**ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే కూనంనేని**

**సుజాతనగర్ పీహెచ్‌సీలో వైద్య శిబిరం ప్రారంభించిన ఎమ్మెల్యే, కలెక్టర్**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో వాసు, మర్చి07(మీడియా టుడే):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రజలకు సమగ్ర వైద్య సేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం సుజాతనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కలెక్టర్ శిబిరాన్ని పరిశీలించి వైద్యులు అందిస్తున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులకు సూచించారు. శిబిరానికి వచ్చిన ప్రజలకు వివిధ వైద్య విభాగాల నిపుణులచే ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు.ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు గ్రామాల్లో అవగాహన కల్పించి ఎక్కువ మంది ప్రజలు శిబిరాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.అవసరమైతే రోగులను కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేసి అక్కడ స్కానింగ్, ఎక్స్-రే వంటి పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స అందించాలని వైద్య అధికారులకు సూచించారు.

**ప్రజలకు సమగ్ర వైద్య సేవలందించడమే లక్ష్యం : కలెక్టర్ అంకిత్.**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో ఉచిత వైద్య శిబిరాలను దశల వారీగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్



తెలిపారు.జిల్లాలో ప్రతిరోజు రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల చొప్పున ఈ వైద్య శిబిరాలను నిర్వహిస్తూ ఈ నెల 31వ తేదీ వరకు కొనసాగించనున్నట్లు తెలిపారు.ఈ వైద్య శిబిరాలలో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, గైనకాలజీ, డెంటల్, ఆప్తమాలజీ వంటి ఆరు విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని ,శిబిరాలకు వచ్చే రోగులకు అవసరమైన మందులను ఉచితంగా అందజేయడంతో పాటు అవసరమైతే మెరుగైన చికిత్స కోసం పై స్థాయి ఆసుపత్రులకు రిఫర్ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ఈ ఉచిత వైద్య శిబిరాలపై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించి ఎక్కువ మంది ప్రజలు ఈ సేవలను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ అధికారి తుకారాం రాథోడ్, తాసిల్దార్ ప్రసాద్, మెడికల్ ఆఫీసర్ రమేష్, ఎంపీడీవో భారతి సంబంధిత శాఖల అధికారులు వైద్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హత్యాయత్నం కేసులో ఐదుగురి అరెస్ట్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో వాసు, మర్చి07(మీడియా టుడే):** కొత్తగూడెం నెహ్రూ బస్తి రైల్వే పట్టాల సమీపంలో ఈ నెల 4న నరేష్ కోరి (40)పై జరిగిన హత్యాయత్నం కేసులో ఐదుగురిని కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు.పోలీసుల వివరాల ప్రకారం, నెహ్రూ బస్తిలోని రైల్వే పట్టాల వద్ద ఉన్న కిరాణా దుకాణం దగ్గర స్నేహితుడితో మాట్లాడుతున్న నరేష్‌పై నాతరి శ్రీనాథ్, లోకేష్, శివ సంజయ్, వసుకుల ఉదయ్, నాతరి రాజేశ్వరరావు అలియాస్ ఐలయ్య దాడి చేశారు. రోకలి బండతో తలపై బలంగా కొట్టడంతో నరేష్ తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయాడు.తీవ్ర గాయాలతో ఉన్న నరేష్‌ను చికిత్స కోసం ఖమ్మంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.నెహ్రూ బస్తిలో నిర్మల అనే మహిళకు చెందిన రెండు అంతస్తుల ఇంటి విషయంలో జరిగిన వివాదమే ఈ దాడికి కారణమని పోలీసులు తెలిపారు. నిర్మలకు మద్దతుగా నరేష్ నిలవడంతో కక్ష పెంచుకున్న నిందితులు ఉద్దేశపూర్వకంగా దాడి చేసినట్లు విచారణలో వెల్లడైందని,ఈ ఘటనపై కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు ఐదుగురు నిందితులను శనివారం అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు ఇన్స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు.

# ఆర్కే కళాశాలలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం




**మీడియా టుడే, కామారెడ్డి, మార్చి 7:** కామారెడ్డి జిల్లా కేంద్రం లోని ఆర్కే డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఆర్కే, ఎస్సార్కే, వీఆర్కే జూనియర్, డిగ్రీ, పీజి కాలేజీల ఆధ్వర్యంలో శనివారం రోజున అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఎంతో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి – శ్రీనివాస్ లు గౌరవ అతిథులుగా తెలంగాణ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ విద్యావర్ధిని, విశిష్ట అతిథులుగా వైస్ చైర్ పర్సన్ కాసర్ల గోదావరి– స్వామి, కౌన్సిలర్ సుజిత – భరత్, డాక్టర్ కిరణ్మయి, కళాశాల సీఈవో డాక్టర్ ఎం జైపాల్ రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ భారతదేశంలో మహిళలకు ఎంతో గౌరవమైనటువంటి ప్రాధాన్యత ఉంటుందని అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 8న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారని ఇది మహిళల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మరియు రాజకీయ సాధనలను మరియు మహిళల హక్కులను గౌరవించడం జరుగుతుందని తెలిపారు, అంతేగాక ప్రతి మహిళను గౌరవించడం ప్రతి మహిళను మాతృ సమానురాలుగా గుర్తించడం మనందరి బాధ్యత అని తెలిపారు. ఎక్కడ అయితే మహిళలు




పూజింపబడతారో మరియు గౌరవింపబడతారో అక్కడ సమస్త దేవతలు కొలువుంటారని తెలిపారు. అదేవిధంగా కళాశాలలో మహిళా సాధికారత అనే అంశంపై ఇచ్చిన ఉపన్యాస మరియు వ్యాసరచన పోటీలలో గెలిచిన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందించడం జరిగింది .ఈ కార్యక్రమంలో కళాశాల సీఈవో డాక్టర్ ఎం జైపాల్ రెడ్డి, పూర్ణిమ, శ్రీవాణి, మహిళ అధ్యాపకులు, సిబ్బంది, డీన్ నవీన్ కుమార్, ప్రిన్సిపల్స్ గోవర్ధన్ రెడ్డి, గంగాధర్, శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్స్, ఏవో, అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మాలమహానాడు జేఏసీ ఆధ్వర్యంలో ఎదులాపురం మున్సిపల్ చైపర్సన్ కు సన్మానం



ఎదులాపురం మున్సిపల్ చైపర్సన్ గా ఇటీవల ఎన్నికైన పోకబత్తిని అనిత ను పార్టీలకు అతీతంగా మాలమహానాడు జేఏసీ ఆధ్వర్యంలో అసంఘం జిల్లా అధ్యక్షులు దాసరి శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువతోఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎస్సి,ఎస్టీ,బీసీ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సేవా సంఘం వ్యవస్థాపకులు జై భీమ్ నారమల్ల, బిఆర్ఎస్ పార్టీ నాయకులు చింతపల్లి వెంకటేశ్వర్లు, నాగటి దుర్గాప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు (వెంకటగిరి,9వ వార్డు)బిందె రమేష్,పాలపాటి మిన్ను,డాక్టర్ ఆర్ఎంపి జమ్మి వీరబాబు,మాలమహానాడు సీనియర్ జిల్లా నాయకులు తురక నాగేశ్వరరావు సన్మాన కార్యక్రమం లో ఉన్నారు.

# పొనుగోడు రిజర్వాయర్‌లో యువకుడి మృతదేహం లభ్యం

( మీడియా టుడే గరిడేపల్లి )



మండల పరిధిలోని పొనుగోడు రిజర్వాయర్‌లో శనివారం ఒక యువకుడి మృతదేహం లభ్యమయింది. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు.మృతుడి వివరాలుమృతుడిని నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన ఏషాల సతీష్ (37) గా గుర్తించారు. ఇతని తండ్రి పేరు మట్టయ్య. మృతుడు పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిగా పోలీసులు ధృవీకరించారు.ఘటన నేపథ్యంరిజర్వాయర్ నీటిలో మృతదేహం తేలుతూ ఉండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సతీష్ మృతదేహాన్ని బయటకు తీయించి, పోస్టుమార్టం నిమిత్తం సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సతీష్ మిర్యాలగూడ నుండి ఇక్కడికి ఎలా వచ్చాడు ఇది ప్రమాదవశాత్తు జరిగిన మరణమా లేక ఆత్మహత్యా? అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు

# మహిళలు అన్ని రంగాలలో రాణించాలని



( మీడియా టుడే గరిడేపల్లి )

మహిళలు విద్య చేతివృత్తులు వ్యాపారం ఉద్యోగాలలో ముందుండాలని ఎంఈఓ మరియు ప్రధానోపాధ్యాయుడు పానుగోతు.ఛత్రునాయక్ అన్నారు. రేపుఅంతర్జాతీయమహిళా దినోత్సవం పురస్కరించుకొని పాఠశాలలో ఉన్నటువంటి ఉపాధ్యాయనీలను శనివారం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉండాలని అందులో ఉపాధ్యాయ వృత్తిలో ఉండటం ఇంకా ఎంతో మంచిదని, ఎందుకనగా తల్లి తన పిల్లలకు ఏ విధంగానైతే మంచి బుద్ధులను నేర్పుతుందో అదే విధంగా పాఠశాలల్లో ఉన్న విద్యార్థినీ విద్యార్థులు అందరినీ కూడా తమ పిల్లలుగా భావించి మంచి,చెడులను తెలుపుతూ చక్కటి విద్యా బోధన చేస్తారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులే ఉపాధ్యాయులు అయిన వేళ



( మీడియా టుడే గరిడేపల్లి )

ఒకరోజు ఉపాధ్యాయులుగా, అధికారులుగా, ప్రజా ప్రతినిధులుగా, విద్యార్థులు అద్భుతంగా రాణించారని ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు పి.ఛత్రు నాయక్ అన్నారు. గరిడేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన స్వపరిపాలన దినోత్సవం లో ఆయన పాల్గొని మాట్లాడుతూ... ప్రధానోపాధ్యాయులుగా, మని బ్రహ్మచారి, విద్యాశాఖ మంత్రిగా ఇందు, కలెక్టర్ గా బిందు శ్రీ, జాయింట్ కలెక్టర్గా కోటేశ్వరి, తహసీల్దారుగా సుప్రియ, ఎంపీడీవో గా త్రివేణి, ఎంఈఓ గా శిరీష, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులుగా, విద్యార్థులుచక్కగా రాణించారని ప్రశంసించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారుఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## శాతవాహనలో "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక"లో భాగంగా స్వచ్ఛ భారత్ పరిసరాల పరిశుభ్రతే మన లక్ష్యం

### - రిజిస్ట్రార్ సతీష్ కుమార్




**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్: మీడియా టుడే , మార్చి 07 :**
శాతవాహన విశ్వవిద్యాలయం ఆవరణలో ప్రగతి పాలన-ప్రగతి ప్రణాళికలో ప్రభుత్వఆదేశాల మేరకు పది రోజుల పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విశ్వవిద్యాలయ ఆవరణలోని పరిపాలన కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ప్రత్యేక ప్రారంభించారు. ఆర్ట్స్ డ న్యాయ కళాశాలలో రిజిస్టార్ ఆచార్య పి సతీష్ కుమార్ స్వచ్ఛభారత్ ను ప్రారంభిస్తూ కళాశాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రత లో భాగంగా చెత్తను వేరువేయాలని పిలుపునిచ్చి స్వచ్ఛతతో తెలంగాణను, దేశాన్ని పరిశుభ్రం చేయాలని పిలుపునిచ్చి న్యాయ కళాశాల,ఆర్ట్స్ కళాశాల జాతీయ సేవా పథకం విద్యార్థులతో కలిసి ఆవరణను శుభ్రపరిచారు.విశ్వవిద్యాలయ సైన్స్ కళాశాల ఆవరణలో కూడా కళాశాల ప్రిన్సిపల్ రమాకాంత్ అధ్యక్షతన స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రారంభించి పిచ్చి మొక్కలను తొలగించారు. విశ్వవిద్యాలయ కామర్స్ కళాశాల ఆవరణలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.హరి కాంత్ అధ్యక్షతన ప్రారంభించిన కార్యక్రమంలో భాగంగా జాతీయ సేవా పథకం అధికారి డాక్టర్ తిరుపతి ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. మానేరు డ్యాము సమీపంలోని ఫార్మసి కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీశైలం అధ్యక్షతన స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రారంభించి పిచ్చి మొక్కలను ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు.ఆర్ట్స్ కళాశాల, న్యాయ ప్రిన్సిపల్ పద్మావతి మాట్లాడుతూ స్వచ్ఛతను విద్యార్థులు తమ జీవితంలో భాగంగా చేసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ఒక బాధ్యతగా భావించి మంచి పర్యావరణాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మహమ్మద్ అబ్రరుల్ భాఖి, జాతీయ సేవా పథకం అధికారులు అధ్యాపకులు విద్యార్థిలు జాతీయ సేవా పథకం వాలంటీర్లు పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు

### సూర్యాపేట జిల్లా ఎస్పి కె నరసింహ



**మీడియా టుడే మార్చి 07 సూర్యాపేట -:**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సంధర్భంగా జిల్లా ఎస్పి నరసింహ జిల్లా లోని మహిళలందరికీ జిల్లా పోలీస్ శాఖ తరపున హృదయపూర్వక శు భాకాంక్షలు తెలియజేశారు.ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మహిళలకు గౌరవం,సమాన అవకాశాలు లభించే సమాజంలోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందనితెలిపారు.నేటి తరం మహిళలు విద్య,ఉద్యోగం ,వ్యాపారం,క్రీడలు, రాజకీయ రంగాల్లో తమ ప్రతిభను చాటుతూ సమాజ పురోగతిలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు .మహిళల భద్రత రక్షణ విషయంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. మహిళలపై జరిగే నేరాలను అరికట్టేందుకు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అవసరమైనప్పుడు మహిళలు నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని వారి ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు పోలీస్ శాఖ కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు .మహిళల భద్రత కోసం ప్రభుత్వం పోలీస్ శాఖ అనేక అవగాహన కార్యక్ర మాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా యువతలో అవగాహన పెంపొందించేందుకు పాఠశాలలు, కళాశాలలు మరియు గ్రామాల్లో షీ టీమ్,కళ జాత బృందం ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.మహిళలు తమ హక్కులు ,చట్టాలు మరియు భద్రతకు సంబంధించిన సేవలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతి మహిళా తన హక్కులపై అవగాహన పెంపొందించుకుని ధైర్యంగా ముందుకు సాగుతూ తన లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు.

## జర్నలిస్ట్ క్రికెట్ కప్ -2026లో బిటిపిఎస్ జట్టు విజయం



**పినపాక నియోజకవర్గం ప్రతినిధి, మార్చి 07(మీడియా టుడే):**
జర్నలిస్ట్ క్రికెట్ కప్--2026 టోర్నమెంట్‌లో సుమారు 25 జట్లు పాల్గొనగా భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (దీ్పూరా) జట్టు ఉత్తమ ప్రదర్శన కనబరిచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది.ఈ సందర్భంగా జట్టు సభ్యులు భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ చీఫ్ ఇంజనీర్ బి. బిచ్చన్నను కలిసి విజేత ట్రోఫీని అందజేశారు. అనంతరం చీఫ్ ఇంజనీర్ జట్టు సభ్యులను అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టీ.జీ. జెన్కో సంస్థలో ఉద్యోగులందరినీ కుటుంబ సభ్యులుగా భావిస్తూ వారి సంక్షేమా నికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. సంస్థ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ నూతన క్రీడా మైదానాలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఉద్యోగులందరూ సంస్థ అభివృద్ధినే తమ అభివృద్ధిగా భావించి విధులను అంకితభావంతోనిర్వహిస్తూ ఉత్పత్తిలో సంస్థను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో క్రీడా కార్యదర్శి కల్తి నరసింహారావు, సిద్ధల హుస్సేన్‌తో పాటు జట్టు సభ్యులు ప్రవీణ్, నవీన్, తిరుపతి, వెంకట్, గంగన్న, మహేష్, శ్యామ్, భరత్, రాము, మైను, రవి, బబ్లు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్



**( మీడియా టుడే గరిడేపల్లి )**
సీర్ . నెంబర్.37/2026 యూ /ఎస్ 331(4),305 బిఎన్ఎస్ అఫ్ పీఎస్ గరిడేపల్లి గరిడేపల్లి, మట్టంపల్లి పియస్ పరిధిలో ఆంజనేయస్వామి పంచలోహ విగ్రహాన్ని దోగతనశీ చేసిన విషయం ఈ రోజు ఉదయం 06-00 గంటల సమయంలో గరిడేపల్లి ఎస్సై తన సిబ్బందితో గరిడేపల్లి గ్రామం నందు పెట్రోల్లింగ్ విధులు నిర్వహిస్తుండగా బణోతు సైదు, మరియు జామ్ల తండా కు చెందిన భూక్యా నర్సింహా అను వారు టీఎస్ 29ఇ 9878 నెంబర్ గల మోటార్ సైకల్ పై వెళ్తుండగా అనుమానం వచ్చి పట్టుబడి చేసి వారి వద్ద ఉన్న సంచిని విప్పి చూడగా అందులో ఆంజనేయ స్వామి పంచలోహ విగ్రహం ఉండగా ఎక్కడిది అని అడగా వారు తేదీ 05.03.2026 రోజున హనుమంతులగూడెం గ్రామంలోని ఆంజనేయ స్వామి గుడిలో దొంగతనం చేసినమని మిర్యాలగూడ పట్టణంలో అమ్ముటకు వెళ్తున్నాము చెప్పగా వారిని విచారించగా అట్టి కేసుతో పాటు కల్మల్ చెరువు గ్రామంలోని అయ్యప్ప స్వామి గుడిలో ఆంప్లిఫ్లేయర్ కూడా దొంగలించినమని చెప్పినారు. గతంలో బాణోతు సైదు హుజూర్ నగర్, మట్టంపల్లి, చింతలపాలెం, కూసుమంచి, మేళ్లచెరువు, పెనుగంచిప్రోలు, గరిడేపల్లి, అనంతగిరి పిఎస్ పరిధిలలో మొత్తం 17 కేసులు కలవు.

**రస్థులు.**
1) బాణోతు సైదు తండ్రి బిక్కు, వయసు,27 సంవత్సరాలు, కులం: ఎస్ టీ, లంబాడ, వృత్తి: టిప్పర్ డ్రైవర్ ఆర్/ఓ బక్కలచ్య తండా హెచ్/ఓ కామంచికుంట గ్రామం, మట్టంపల్లి మండలశీ2) భూక్యా నర్సింహా తండ్రి సక్రు, వయసు: 22 సం.రాలు, కులం: ఎస్ టీ,లంబడ, వృత్తి: ప్రైవేట్ జాబ్, ఆర్/ఓ జామ్ల తండా, మట్టంపల్లి మండలం.

# సమాజంలో ప్రతి మహిళను గౌరవించాలి

### మహిళా దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**మీడియా టుడే/మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా: మార్చ్ 07**
అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని జరుపుకోవడం ద్వారా మన బాధ్యత తీరిపోదని, మన కుటుంబ సభ్యులకు జరిగే అసౌకర్యం గానీ అవమానం గానీ మనం ఏ విధంగా ఆలోచన చేస్తామో, సమాజంలో ప్రతి మహిళల పట్ల కూడా మనం అదే విధంగా ఆలోచన చేసి దానికి అవసరమైన నివారణ చర్యలు తీసుకోవాలి అని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం కెపిహెచ్ బి లోని జెఎన్టియూ ఆడిటోరి యంలో వుమెన్ సేఫ్టీ వింగ్ అడిషనల్ డిజిపి చారు సిన్హా ఐపిఎస్, పోలీసు శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "స్టాండ్ విత్ హర్" కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ డిజిపి శివధర్ రెడ్డి, హైదరాబాదు పోలీస్ కమీషనర్ సజ్జనార్, హయ్యర్, స్కూల్ ఎడ్యూకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరి యోగితారాణా, మహిళ శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ అనితా రామచంద్రన్, సైబరాబాద్ పోలీస్ కమీషనర్ ఎం రమేష్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, సైబరాబాదు మున్సిపల్ కమీషనర్ సృజన, యూనిసేఫ్ ఛీఫ్ ఫీల్డ్ ఆఫీసర్ జలాలీమ్ బిర్హాను టఫెస్సా, ప్రముఖ సిని నటుడు సాయి దుర్గ తేజ్, హాయజయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే మహిళలకు అత్యంత భద్రత కలిగిన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలనే ఒక మంచి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరిలో మహిళల పట్ల బాధ్యతయుతంగా వ్యవహరించడం అలవాడాలన్నారు. మహిళల పట్ల మనమందరం .స్టాండ్ విత్ హర్ అని ఆలోచించి ఒక బాధ్యతగా తీసుకుంటే ఖచ్చితంగా నూటికి నూరు శాతం తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు రక్షణ అందించడం కష్టం కాదన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరి ఆలోచనలో మార్పురావాలన్నారు. . అందుకే మహిళల రక్షణ కోసం తెలంగాణ యువకులు ఒక బ్రాండ్ అంబాసిడర్‌గా నిలబడి మనం ఎంత విజయం సాధించినా మహిళలను ఆర్థికంగా నిలబెట్టినప్పుడే ఆ కుటుంబము, ఆ రాష్ట్రము, ఆ దేశము ఆర్థికంగా బలపడుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం 2034కి 1 ట్రిలియన్ డాలర్స్ ఎకానమీ, 2047కి 3 ట్రిలియన్ డాలర్స్ ఎకానమీ రీచ్ అవ్వాలి అని అంటే సమాజంలో సగభాగమైన ఆడపిల్లలకు రక్షణ ఉండాలని, రక్షణ ఉన్న ఆడపిల్లలు ఆర్థికంగా ఎదగాలి, ఆర్థికంగా ఎదగాలి అంటే వాళ్ళు చదువుకోవాలి. వంటింటి కుందేళ్ళుగా ఇంటికే పరిమితం కాకుండా వాళ్లలో ఉన్న శక్తి నైపుణ్యాన్ని ఈరోజు వాళ్ళు అభివృద్ధి చేసుకొని తెలంగాణ ఎకానమీలో వాళ్ళని భాగస్వాములను చేయాలన్నదే మా ప్రభుత్వం యొక్క ఆలోచన అన్నారు. ఈరోజు ప్రపంచంలో ఏ అభివృద్ధి చెందిన దేశాన్నైనా చూడండి, ఏ దేశంలో అయితే మహిళలు ఇంట్రప్రెన్యూర్స్‌గా, మహిళా ఎంప్లాయిస్‌గా, మహిళలు సైంటిస్టులుగా లేకపోతే డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లుగా రాణించారో ఆ దేశమే ఆర్థిక పురోగతి సాధించినాయని, తెలంగాణ రాష్ట్రం కూడా ఆర్థిక పురోగతి వైపు వేగంగా ప్రయాణం చేస్తుందన్నారు. మహిళలు ఇంకా రాణించాలి, ధైర్యంగా వాళ్ళు ఉద్యోగ ఉపాధి అవకాశాలను నిర్వహించాలి అని అంటే ఆ మహిళలకు రక్షణ ఉండాలి, ఆ రక్షణ కలిగించే బాధ్యత చట్టాలు చేయడమో పోలీసుల పహారాలు కాయడమో సరిపోదు, మనమ ందరం కూడా సామాజిక బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. మనమ ందరం కూడా ఆ రక్షణ కల్పించినప్పుడు ఎవరైనా ఏదైనా వాళ్ళకి ఇబ్బంది కలిగించినప్పుడు వారికి అండగా నిలబడి సహాయమ ందించాలన్నారు. నాకెందుకులే అని చూసి చూడనట్టు ఉండటం కూడా ఒక రకంగా నేరాన్ని ప్రోత్సహించడమే అవుతుందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు మహిళల పేరుతోనే అందిస్తున్నామని, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు మహిళల పేరుతో, స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందించి వారికి శిల్పారామం వద్ద దుకాణ సముదాయాన్ని కేటాయించామని, సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించి మహిళలు అదానీ, అంబానీలతో పోటీపడేలా చర్యలు చేపట్టామన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యంతో పాటు వెయ్యి బస్సులకు మహిళలను యజమానులను చేశామని, పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయించి మహిళలు ఆర్థికంగా ఎదిగేలా చర్యలు తీసుకుంటూ, మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టి మహిళా శక్తి స్ఫూర్తిని చాటామన్నారు. మహిళా శక్తిపై రాష్ట్ర ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం ఉందని, దేశంలోనే తెలంగాణను మహిళలకు అత్యంత భద్రత కలిగిన రాష్ట్రంగా తీర్చి దిద్దాలనే స్టాండ్ విత్ హర్ కార్యక్రమం తీసుకున్నామన్నారు.

## అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించిన విద్యార్థి శశిధర్ ని సన్మానించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**మీడియా టుడే, కామారెడ్డి, మార్చి 7:**
బాల్ బ్యాడ్మింటన్ క్రీడలో ప్రతిభ కనబరుస్తున్న శశిధర్ రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక పోటీలలో పాల్గొని మంచి ప్రతిభ చాటినందున, శనివారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో బాన్సువాడ గ్రామానికి చెందిన విద్యార్థి శశిధర్‌ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సన్మానించారు.ఇప్పటివరకు శశిధర్ 15 సార్లు రాష్ట్ర స్థాయి పోటీలలో, 7 సార్లు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్నారు. ఇటీవల 14.02.2026 నుండి 19.02.2026 వరకు ఇండోనేషియాలో జరిగిన ఇంటర్నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ టెస్ట్ సిరీస్‌లో ఇండియా జట్టు తరుపున పాల్గొని బంగారు పతకం సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచాడనీ, జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చినందుకు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శశిధర్‌ను అభినందిస్తూ భవిష్యత్తులో ప్రపంచ స్థాయిలో కూడా రాణించేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు లోయపల్లి చిన్న నర్సింగ్ రావు, కార్యదర్శి కృష్ణమూర్తి , నిజామాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ కోశాధికారి రాజేశ్వర్ , జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారి రంగ వెంకటేశ్వర్ గౌడ్ , శశిధర్ తండ్రి శివ రాజులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## భారత క్రికెట్ జట్టుకు తేజ టాలెంట్ స్కూల్ విద్యార్థుల శుభాకాంక్షలు




**కోదాడ, మార్చి 07 (మీడియా టుడే)-:**
నేడు జరగబోయే భారత్ , న్యూజిలాండ్ క్రికెట్ ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా తేజ టాలెంట్ స్కూల్, కోదాడ విద్యార్థులు భారత క్రికెట్ జట్టుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భారత జట్టు ఈ కీలక పోటీలో విజయం సాధించి దేశానికి గౌరవం తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు భారత జట్టుకు మద్దతుగా నినాదాలు చేస్తూ తమ ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు. భారత ఆటగాళ్లు ధైర్యంగా ఆడి ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించి దేశానికి కీర్తి తీసుకురావాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్, సెక్రటరీ, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొని భారత జట్టుకు తమ ఆశీస్సులు అందజేశారు. దేశ గౌరవాన్ని మరింత పెంచేలా భారత జట్టు విజయంతో తిరిగి రావాలని అందరూ ఆకాంక్షించారు.

# నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం చేసిన లబ్ధిదారులకు శుభాకాంక్షలు

**రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి - ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాన్ని ప్రారంభించిన**

**రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**



**మీడియా టుడే, కామారెడ్డి, మార్చి 7:**
కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భిక్కనూర్ లక్ష్మీ, చిట్యాల రాజమణిలకు నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎం ఆదేశాల మేరకు లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు , వస్త్రాలు అందజేశారు. అనంతరం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కతో ఫోన్ ద్వారా మాట్లాడించి, లబ్ధిదారులకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి పాదయాత్ర సమయంలో కూలిపోయిన ఇళ్లను చూసి చలించిపోయి అధికారంలోకి రాగానే ఇళ్లను నిర్మించి ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశం చేయించడం ప్రభుత్వం ప్రజల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న మరికొన్ని ఇందిరమ్మ ఇళ్లను కూడా త్వరలో పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధు మోహన్, గ్రామ సర్పంచ్ లక్ష్మి, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్, మున్సిపల్ ఛైర్మన్ ఇప్ప ఉమారాణి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కామారెడ్డి జిల్లా చిన్న మల్లారెడ్డి గ్రామ లబ్ధిదారులకు శుభాకాంక్షలు , అభినందనలు తెలిపిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం చేసిన లబ్ధిదారులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఇళ్లలో సంతోషంగా జీవించాలని, కుటుంబాలు అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. అలాగే ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు.

# అశ్వారావుపేటలో ప్రజాపాలన 99 రోజుల కార్యాచరణ ప్రారంభం

**పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ**





**అశ్వారావుపేట నియోజకవర్గం ప్రతినిధి మధు,మార్చి07 (మీడియా టుడే)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మున్సిపాలిటీలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాన్ని శనివారం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వచ్ఛత కార్యక్రమాల్లో పాల్గొని మున్సిపాలిటీ పరిధిలో పరిశుభ్రత పనులను ప్రారంభించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా కౌన్సిలర్లు, మున్సిపల్ మహిళా సిబ్బందిని ఎమ్మెల్యే సన్మానించారు. మహిళలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ మున్సి పాలిటీ కార్యాలయం నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. ర్యాలీలో పరిశుభ్రతపై నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మొదటి 15 రోజులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే నాల్గవ వార్డులో డ్రైనేజీల శుభ్రత పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు .అశ్వారావుపేట మున్సిపాలిటీ అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రజలు కూడా పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొని సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జూపల్లి శశికళ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, కౌన్సిలర్లు, దేరంగుల ప్రసాద్, దగ్గుమల్లి మౌనిక, చిన్నంశెట్టి శ్రీను, కట్ట సింధుజ, కొట్టే నాగ సునీత, షేక్ రహీన, కారం కనకదుర్గ, మిండా హరిబాబు, నార్లపాటి మహేష్ బాబు, పట్టం రమ్య, మోర్ల రాజేశ్వరి, దండ బత్తుల ఆదిలక్ష్మి, తిరుమల శెట్టి వెంకన్న బాబు, షేక్ నూర్జహాన్, నార్లపాటి దివాకర్, మున్సిపల్ కమిషనర్, అధికారులు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు, యువత పాల్గొన్నారు.

# కిట్స్‌లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు




**కోదాడ, మార్చి 07 (మీడియా టుడే)–:**
కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ తెలిపారు. ఈ మహిళా దినోత్సవ వేడుకలకు కోదాడ లోని ప్రముఖ మహిళా వైద్యురాలు, గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రమీల హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు మహిళలు వివిధ రంగాలలో సాధించిన కృషి విజయాలను గుర్తించడానికి వారిని అభినందించడానికి మహిళా దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 8 వ తారీఖున మహిళా దినోత్సవం జరుపుకుంటారని తెలిపారు. ఆధునిక మహిళలు ఇకపై పురుషులపై ఆధారపడే అవసరం లేకుండా ముందుకు సాగుతున్నారని మరియు ప్రతి అంశంలోనూ స్వతంత్రంగా ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తున్నారని వివరించారు. అలాగే క్రీస్తుశకం ముందు నుంచే మహిళలు విద్యావంతులని, దేశ ప్రగతిలో మహిళలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెరుమాళ్ళపల్లి గాంధీ, డైరెక్టర్ డాక్టర్ నాగార్జున రావు, మహిళా అధ్యాపకులు స్రవంతి, పుష్పలత, లావణ్య, అరుణ, చైతన్య కమల కుమారి, జ్యోతి, ప్రత్యూష, ఉమారాణి, చంద్రకళ, సరిత, లక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఐటీడీఏలో పచ్చదనం -పరిశుభ్రత కార్యక్రమం

**కార్యాలయాల్లో పరిశుభ్రత, పచ్చదనానికి ప్రాధాన్యం :ఐటీడీఏ జనరల్ డేవిడ్ రాజ్**



**భద్రాచలం ,మార్చి 07 (మీడియా టుడే):**
రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సూచనల మేరకు ఐటీడీఏ వివిధ విభాగాల యూనిట్ అధికారులు సిబ్బంది సమక్షంలో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించడం జరిగిందని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. శనివారం నాడు సాయంత్రం ఐటీడీఏ చిల్డ్రన్స్ పార్క్, పరిసరాలు, ఐటీడీఏ వెనుక భాగం, నివాసగృహాల ఆవరణలో "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక"కార్యక్రమంలో పచ్చదనం పరిశుభ్రత ప్రతిజ్ఞ"కార్యక్రమాన్ని అధికారులు సిబ్బందితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ఆదేశించిన పది రోజుల కార్యచరణ వల్ల పెండింగ్ ఫైల్స్, పారిశుద్ధ్యం, అసంపూర్ణ నిర్మాణ సంబంధ కార్యక్రమాలు, మరమ్మత్తులు, కార్యాలయంలోని పనికిరాని వస్తువులు తొలగించి ప్రతి సెక్షన్ చూపరులకు ఆకట్టుకునేలా తీర్చిదిద్దడానికి ఈ కార్యక్రమం ఒక చక్కని వేదిక అన్నారు. ఐటీడీఏ ప్రాంగణంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో కూడా సిడిపిఓ జ్యోతి సారథ్యంలో సూపర్వైజర్లు సిబ్బంది అందరూ కలిసి పచ్చదనం పరిశుభ్రత లో భాగంగా పరిసరాలు శుభ్రం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఏవో సున్నం రాంబాబు, ఏ సీఎంఓ రమేష్, ఏపీవో పవర్ వేణు, పివిటిజి అధికారి గన్యా, మేనేజర్ ఆదినారాయణ మరియు ఐసిడిఎస్ సిబ్బంది సిడిపిఓ జ్యోతి, సూపర్వైజర్లు అనసూయ, చంద్రకళ, సిబ్బంది వివిధ విభాగాల పర్యవేక్షకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిబంధ ప్రతియోగిత ( వ్యాసరచన పోటీ )లో శిశు మందిర్ విద్యార్థుల ప్రతిభ




**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ : మీడియా టుడే , మార్చి 07 :**
విద్యాభారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ – న్యూ ఢిల్లీ ద్వారా దేశ వ్యాప్తంగా నిర్వహింపబడుతున్న సందర్భంగా శ్రీ సరస్వతీ శిశు మందిర్ ప్రధానాచార్యులు మాట్లాడుతూ విద్యార్థులకు నిబంధ ప్రతియోగిత ( వ్యాస రచన ) పోటీ ప్రతి సంవత్సరము మన శ్రీ సరస్వతీ శిశు మందిర్ కరినగర్ పాఠశాలకు శిశు వర్గలో మల్లగల్ల సాన్విక 5 వ, బాల వర్గలో – బొల్లి ఆదిత్య 7 వ, ప్రథమ స్థానం సాధించారన్నారు. దేశ వ్యాప్తంగా నిర్వహించిన వ్యాస రచన పోటీలో మన కరినగర్ శిశు మందిర్ విద్యార్థులు రెండు శ్రేణుల్లో ప్రథమ స్థానం పొందడం మన పాఠశాలకు ఎంతో గర్వకారణం అని కొనియాడారు. విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కోలాఅన్నా రెడ్డి, డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, ఎలగందుల సత్యనారాయణ, మేచినేని దేవేందర్ రావు, గట్టు శ్రీనివాస్, డాక్టర్ నాళ్ల సత్య విద్యాసాగర్, రాపర్తి శ్రీనివాస్, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, పులాల శ్యామ్, కొత్తూరి ముకుందం, గోలి పూర్ణచందర్, గట్టు రాంప్రసాద్ తదితరులు అభినందనలు తెలియజేశారని పాఠశాల ప్రధానాచార్యులు సముద్రాల రాజమౌళి తెలిపారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక




**మీడియా టుడే, కామారెడ్డి, మార్చి 7:**
తెలంగాణ ప్రభుత్వ విద్యాశాఖ ఆదేశాల మేరకు కామారెడ్డి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో చేపట్టిన 10 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక శనివారము రెండవ రోజుకు చేరుకుంది. మార్చి 6 నుండి జూన్ 12 వరకు కొనసాగే 99 రోజుల 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా శనివారం కళాశాలలో పరిపాలన మరియు పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించారు. కళాశాలలోని వార్షిక మరియు పరిపాలన సంబంధిత రికార్డులను, సిబ్బంది సమన్వయంతో అప్‌డేట్ చేశారు. కళాశాలలోని అన్ని విభాగాల అధ్యాపకులు మరియు సిబ్బంది తమ తమ విభాగాల్లో శ్రమదానం నిర్వహించారు. గదుల శుభ్రత, పరికరాల అమరిక మరియు పరిసరాల పరిశుభ్రత పనులను పూర్తి చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం మేరకు విద్యా సంస్థల్లో జవాబుదారీతనాన్ని, నాణ్యతను పెంచేందుకు ఈ 99 రోజుల ప్రణాళిక ఎంతో దోహదపడుతుందని, రెండవ రోజున రికార్డుల క్రమబద్ధీకరణతో పాటు ప్రతి విభాగం పరిశుభ్రంగా ఉండేలా శ్రమదానం చేపట్టినట్లు, విద్యాబోధనతో పాటు ఉత్తమ పరిపాలన అందించడమే మా లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కే కిష్టయ్య, డాక్టర్ పి విశ్వప్రసాద్, అంకం జయప్రకాష్, డాక్టర్ ఏ. సుధాకర్, డాక్టర్ జి శ్రీనివాసరావు, ఎన్ రాములు, మానస, శ్రీవల్లి, డాక్టర్ శారద వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక మరియు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# స్నేహ నర్సింగ్ మహిళా కళాశాలలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**కోదాడ, మార్చి 07 (మీడియా టుడే)–:**
కోదాడ పట్టణంలోని స్నేహ నర్సింగ్ మహిళా కళాశాలలో ముందస్తు గా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమం నకు ముఖ్య అతిథిగా హాజరైన యం యస్ విద్యా సంస్థల సీ ఈ వో యస్ యస్ రావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం గా జరుపుకుంటారని ఇది మహిళల హక్కులు, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో వారి సాధనలను గుర్తిస్తూ జరుపుకునే రోజు అని అన్నారు. పురుషులతో సమానంగా మహిళలకు హక్కులు, అవకాశాలు కల్పించాలని, నిర్ణయాధికారంలో భాగస్వాములు అవ్వాలని, అన్ని రంగాలలో రాణించాలని, కుటుంబం, సమాజం, దేశ అభివృద్ధిలో మహిళల పాత్రను గుర్తించి గౌరవించాలని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాధవి అధ్యాపకులు సబిహా, అనూష, ఏవో నసీమా లను విద్యార్థినులతో కలిసి ఎస్ఎస్ రావు శాలువాలతో ఘనంగా సన్మానించి ,అందరికీ స్వీట్స్ అందజేశారు.

# సమాజ అభివృద్ధికి మహిళలు ఆదర్శంగా నిలవాలి

## జిల్లా కలెక్టర్ అంకిత్.





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో వాసు, మర్చి07(మీడియా టుడే):** మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ అంకిత్ ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి విద్య ఎంతో కీలకమని అన్నారు. విద్యావంతురాలైన మహిళ అన్ని రంగాల్లో తన ప్రతిభను చాటుకుని ఉన్నత స్థాయికి ఎదగగలదని తెలిపారు. సమాజ పురోగతిలో మహిళల పాత్ర అత్యంత ముఖ్యమని అన్నారు. ప్రతి రంగంలో మహిళలు ముందుకు వచ్చి తమ సామర్థ్యాలను నిరూపిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మాట్లాడుతూ, మహిళల పట్ల లింగ వివక్ష తొలగింపు కుటుంబ వ్యవస్థ నుండే ప్రారంభం కావాలని అన్నారు. తల్లిదండ్రుల ఆలోచనా విధానం మారినప్పుడే సమాజంలో సమానత్వం సాధ్యమవుతుందని తెలిపారు . పనిచేసే మహిళలపై ఎటువంటి వేధింపులు జరగకుండా ఉండేలా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు.

**మహిళల సాధికారతకు ఆత్మవిశ్వాసం ఎంతో అవసరం**

**సంక్షేమ శాఖ జిల్లా అధికారి స్వర్ణలత లేనినా.**

మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి స్వర్ణలత లేనినా మాట్లాడుతూ, మహిళల సాధికారతకు విద్య, అవగాహన మరియు ఆత్మవిశ్వాసం ఎంతో అవసరమని అన్నారు. బాలికల విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. "బేటీ బచావో -- బేటీ పడావో" కార్యక్రమం ద్వారా బాలికల విద్య, భద్రత ,సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని అన్నారు. ప్రతి కుటుంబంలో బాలికలకు సమాన అవకాశాలు కల్పించి వారి ప్రతిభను వెలికితీయాల్సిన బాధ్యత సమాజంపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను సన్మానించారు. అలాగే ఇటీవల జరిగిన మున్సిపల్ కార్పొరేషన్, పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన మహిళా కార్పొరేటర్లు, సర్పంచులు, ఉప సర్పంచులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, వివిధ శాఖల మహిళా అధికారులు, కార్పొరేటర్లు, మహిళా సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు,మహిళా సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

## డా.సుధాకర్ గౌడ్



**మీడియా టుడే, కామారెడ్డి, మార్చి 7:** కామారెడ్డి జిల్లా కేంద్రానికి సమీపంలోని సౌత్ క్యాంపస్ లో విద్యార్థులు ఎవరైనా ర్యాగింగ్ కు పాల్పడినా, క్రమశిక్షణ ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని ప్రిన్సిపల్ డా. సుధాకర్ గౌడ్ హెచ్చరించారు. మొన్న జరిగిన సంఘటనలో కొంతమంది విద్యార్థులను హాస్టల్ నుంచి తాత్కాలికంగా సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. ఆ రోజు సంఘటన నేపథ్యంలో ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో అధ్యాపకుల సమావేశం నిర్వహించారు. అన్ని అంశాలపై కూలంకషంగా చర్చించి, తీసుకోవాల్సిన చర్యలను నిర్ణయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డా. సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ జరిగిన సంఘటన పట్ల బాధను వ్యక్తం చేశారు. విద్యార్థులు ర్యాగింగ్ కు పాల్పడడం చట్టరీత్యా నేరం అన్నారు. ఈ విషయంలో విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. నేటి నుంచి మరొక్క సారి అన్ని విభాగాల విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తామని సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. యూనివర్సిటీ తరపున కమిటీ వేశామని కమిటీ నివేదిక ఆధారంగా ఎవరు తప్పు చేసినట్టు తేలినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతీ విద్యార్థి విశ్వ విద్యాలయ నిబంధనలకు కట్టుబడి ఉండాలని తెలిపారు. ఆయా విభాగాల అధ్యక్షులు విద్యార్థుల ప్రవర్త పట్ల, వారి చదువు పట్ల శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు సకాలంలో క్లాస్ లకు హాజరయ్యేలా చూడాలని, క్రమ శిక్షణ పాటించేలా చూడాలని తెలిపారు. ప్రిన్సిపల్ పిలుపు మేరకు ఫిజిక్స్, పొలిటికల్ సైన్స్ విభాగాల్లో విద్యార్థులతో సమావేశాలు పూర్తి అయ్యాయనీ, మిగిలిన విభాగాలు కూడా పూర్తి చెయ్యాలని తెలిపారు. తర్వాతి చర్యగా పోలీస్ ల సహాయంతో మరొక్కమారు అందరూ సీనియర్, జూనియర్ విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో హాస్టల్ వార్డెన్ లు డా.సునీత, డా.యాలాద్రి ఏ పి ఆర్ ఓ డా. సరిత పిట్ల, ఫిజిక్స్ హెడ్ డా. మోహన్ బాబు, సోషల్ వర్క్ హెడ్ డా. అంజయ్య, జియో ఇన్ఫర్మాటిక్స్ హెడ్ డా. సబిత, అధ్యాపకులు డా. హరిత లక్కరాజు, డా. ప్రతిజ్ఞ, డా. నారాయణ, డా. నిరంజన్,డా.వైశాలి, డా. నర్సయ్య, డా. రమాదేవి, శ్రీకాంత్, దిలీప్, డా. శ్రీమాత, డా.ఇంద్రకరణ్,శ్రీకాంత్, డా.పోతన్న,డా. కనకయ్య, డా. ఆఫ్రీన్, డా. వెంకట్రెడ్డి, డా. మహిపాల్, డా. విజయ్ కుమార్, డా. సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

## ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

### దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు, ఆర్థిక సహాయం పంపిణీ





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో వాసు, మర్చి07(మీడియా టుడే):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు, వివాహ ప్రోత్సాహక బహుమతులు, ఎకనామిక్ రిహాబిలిటేషన్ స్కీం సబ్సిడీలను పంపిణీ చేశారు. జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దివ్యాంగులకు వారి దైనందిన జీవితంలో సహాయ ఉపకరణాలు ఎంతో ఉపయోగపడతాయని, లబ్ధిదారులు వాటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. అర్హులైన దివ్యాంగులకు సి.ఎస్.ఆర్ ద్వారా రెట్రో ఫిట్టెడ్ మోటార్ వాహనాలు (స్కూటీలు) అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ట్రాన్స్ జెండర్ వ్యక్తులు సమాజంలో వివక్షకు గురికాకుండా స్వయం ఉపాధి పొందేందుకు ప్రభుత్వం సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తోందని తెలిపారు. ఈ పథకాల ద్వారా వారు ఆర్థికంగా స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు రెట్రో ఫిట్టెడ్ మోటార్ వాహనాలు 25, బ్యాటరీ ట్రైసైకిళ్లు 7, బ్యాటరీ వీల్ చైర్లు 7, దివ్యాంగుల ఎకనామిక్ రిహాబిలిటేషన్ సబ్సిడీ 8 మందికి, వివాహ ప్రోత్సాహక బహుమతి 8 మందికి, ట్రాన్స్ జెండర్స్ ఆర్థిక పునరావాస పథకం సబ్సిడీ 5 మందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, కార్పొరేటర్ ఎన్. శ్యామల, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుండపునేని సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాలలో పరిశుభ్రత కార్యక్రమం




**భద్రాచలం ,మార్చి 07 (మీడియా టుడే):** ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జాన్ మిల్టన్ తెలిపారు. శనివారం కళాశాలలోని ప్రయోగశాలలు, తరగతి గదులు, అధ్యాపకుల గదులు, గ్రంథాలయాన్ని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, బోధన సిబ్బంది కలిసి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జాన్ మిల్టన్ మాట్లాడుతూ, విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు తాము చదివే కళాశాలలో కూడా పరిశుభ్రతను పాటించాలని సూచించారు. పరిశుభ్రత యొక్క ప్రాధాన్యతను విద్యార్థులు గుర్తించి కళాశాల అభివృద్ధికి వాలంటీర్లుగా ముందుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగాధిపతులు డాక్టర్ కిరణ్ కుమార్, బి. సుధాకర్ రావు, విభాగాధిపతులు హవీలా, డాక్టర్ శ్రీను, డాక్టర్ రాగసుమ, ఎన్. హిమజ, డాక్టర్ నాగ సమీరా, వెంకటకృష్ణతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు స్థలంలో నిర్మించిన హోటల్‌ను తొలగించాలి : బీఎస్పీ నేత కొండా చరణ్



**చర్ల,మార్చి 07 (మీడియా టుడే):** చర్ల మండల కేంద్రంలోని సాయిబాబా గుడి మెట్ల వద్ద రోడ్డు స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన హోటల్‌ను తక్షణమే తొలగించాలని బీఎస్పీ భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు కొండా చరణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో రెవెన్యూ శాఖ డిప్యూటీ తహసీల్దార్‌కు, గ్రామపం చాయతీ కార్యదర్శి సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొండా చరణ్ మాట్లాడుతూ చర్ల మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు పెరుగుతున్నాయని ఆరోపించారు. పలుకుబడి ఉన్న కొందరు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తూ నిర్మాణాలు చేపడుతున్నారని అన్నారు. అలాంటి ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సాయిబాబా గుడి వద్ద రోడ్డు స్థలాన్ని ఆక్రమించి ఇల్లు నిర్మించి అందులో హోటల్ నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి ఆక్రమణలు జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం సరికాదని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు స్థలంలో నిర్మించిన హోటల్‌ను తొలగించడంతో పాటు ఆక్రమణకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఆక్రమణలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

# శ్రీ పద్మావతి అమ్మవారికి వెండి వక్షస్థల కవచం వితరణ

**ఎన్టీఆర్ జిల్లామొరుసుమల్లి వాసులు శ్రీధర్,రామారావు సోదరులు**

**స్వయంగా తయారు చేయించిన దీని విలువ రూ. లక్ష**



**మీడియా టుడే మధిర:** అనుకున్న కోర్కెలు తీర్చే అమ్మ పద్మావతి అమ్మ ఆ అమ్మకు వెండి వక్షస్థల కవచం బహుకరణ అందజేయటం అమ్మ ఆశీర్వాదం వల్లే ఇది సాధ్యమైందని దాతలు పేర్కొన్నారు. తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన ఎర్రుపాలెం మండలం జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామివారిని భక్తులు శనివారం అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. దేవాలయ అర్చకులు ప్రాతఃకాల అర్చనలు, సర్వంగా అభిషేకం ప్రత్యేక పూజలు సహస్రనామార్చన చేసి భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లా మొరుసుమల్లి గ్రామానికి చెందిన శ్రీధరు, నాగేశ్వరావు,రాజేశ్వరమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు శ్రీధర్, రామారావు మరియు వారి సోదరులు శ్రీ పద్మావతి అమ్మవారికి వెండి వక్షస్థల కవచం స్వయంగా తయారు చేయించి ఆలయ అధికారులకు అందజేశారు. ఈ కవచానికి లఘు సంప్రోక్షణ,పుణ్యాహవాచనం,అగ్ని శుద్ధి వంటి వైద్యక ప్రక్రియలు నిర్వహించి శ్రీ పద్మావతి అమ్మవారికి ప్రత్యేక అలంకారణంగా అలంకరిస్తారని ఆలయ కార్య నిర్వహణ అధికారి కొత్తూరు జగన్మోహన్రావు తెలిపారు. దాతలకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఘనంగా సత్కరించినట్లు వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల విజయ్ దేవశర్మ తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో ప్రధానార్చకులు శ్రీనివాస్ శర్మ,ఇతర అర్చకులు, సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు

# దాతల సహకారంతో అన్నదానం

**మీడియా టుడే మధిర:**



ఎర్రుపాలెం మండల పరిధిలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వర అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో ప్రతి నిత్యం అన్నదానం నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు గ్రామానికి చెందిన గుడిపూడి నరేష్ స్వప్న దంపతులు వారి కుమార్తె మనస్వి విజయవాడ నగరానికి చెందిన కొత్తపల్లి వివేక్ సాయి ప్రభ వివాహాన్ని పురస్కరించుకొని శనివారం జమలాపురంలో శ్రీవారి సన్నిధిలో మహా అన్నదానం గావించారు. ఇంతటి మహోపకారానికి ముందుకొచ్చి అన్నదానం చేసిన దాతలకు సేవాసమితి సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇలానే దాతలు ముందుకు వచ్చి సహకరిస్తే వారి పేరు మీద స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేయటానికి సహకరించిన వారవుతారని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు వారికి వెళ్లవేల ఉంటాయని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు బొబ్బ కృష్ణ ప్రసాద్, ఉపాధ్యక్షులు ఇమ్మిడి ఈశ్వరచంద్ర విద్యాసాగర్, కార్యదర్శి ఎల్వి నారాయణరెడ్డి, సహయ కార్యదర్శి చింత కిషోర్, కోశాధికారివీరమాచినేనివెంకటకృష్ణ,మాజీ ఈవో ఎ విష్ణుమూర్తి, సేవాసమితి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు

# డీఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన అంబేద్కర్‌వాది కత్తి బాలకృష్ణ

**కొత్తగూడెం ,మార్చి 07 (మీడియా టుడే):**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో ప్రముఖ అంబేద్కర్‌వాది, సామాజిక సేవకుడు కత్తి బాలకృష్ణ స్థానిక డీఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సామాజిక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కత్తి బాలకృష్ణ మాట్లాడుతూ పోలీసు శాఖ ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తోందని అభినందించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టడం తన లక్ష్యమని, సమాజంలో అణగారిన వర్గాలకు న్యాయం జరిగేలా కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, విద్యాభివృద్ధి వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో యువతకు చట్టాలపై అవగాహన కల్పించడం, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. సమాజంలో శాంతి భద్రతలు కాపాడటంలో పోలీసులు, ప్రజలు పరస్పర సహకారంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. సమాజ అభివృద్ధి కోసం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చూపిన మార్గంలో కొనసాగుతానని కత్తి బాలకృష్ణ తెలిపారు.

# మహిళ దినోత్సవ వేడుకలు

**రాయికల్-మీడియా టుడే-మార్చి 7:**



రాయికల్ పట్టణంలోని మార్కండేయ నగర్ లో గల్లీ కిట్టి పార్టీ సభ్యులు మహిళ దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సాధికారతే లక్ష్యంగా అన్ని రంగాల్లో మహిళలు రాణించేలా ప్రతి మహిళా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్వేత, రజిత, పుష్పలత, సుమలత, రమ, శాంత, నిరజ, శోభ, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

# నవ మహిళ సాధికార కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు




**పాల్వంచ ,మార్చి 07 (మీడియా టుడే):**

పాల్వంచలోని నవ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా సాధికార కేంద్రంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సునీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తాటాకుల కళాకృతుల శిక్షకురాలు అమ్ముద మహిళలతో తన అనుభవాలను పంచుకున్నారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ముఖ్య అతిథి మాట్లాడుతూ, మహిళల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ విజయాలను గుర్తించి గౌరవించడానికి మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. మహిళల సాధికారత కోసం నవ లిమిటెడ్ చేస్తున్న కృషిని అభినందించారు. ఈ సందర్భంగా ఎస్బీఐ క్యాషియర్ శ్రీమతి సింధు మాట్లాడుతూ నవ మహిళా సాధికార కేంద్రం చేపడుతున్న కార్యక్రమాలను మహిళలు వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా అతిథులను సన్మానించి, మహిళా సాధికార కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ శ్రీమతి సింధు, ఎస్బీఐ డిప్యూటీ మేనేజర్ కళ్యాణి, మహిళా సాధికార కేంద్ర సిబ్బంది టి. అరుణ, అమ్ముద, అరుణ, కవిత, దివ్యతో పాటు వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ వీరనారి మహిళ సంఘం ఆధ్వర్యంలో

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం







**మీడియా టుడే ఖమ్మం ఆర్సి**

ఖమ్మం : తెలంగాణ వీరనారీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పి ఆర్ దేవి అధ్యక్షతన ప్రారంభమైంది. మహిళ నాయకురాలు అడ్వకేట్ చావా శృతి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందున్నప్పటికీ ఎన్నో సమస్యలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహిళా దినోత్సవం ఎలా ఏర్పడిందంటే 1908 లో న్యూయార్క్ నగరంలో జూట్ కార్మికులు 19 గంటల పనిని శ్రమను యాజమాన్యం ఎక్కువగా దోచుకుంటుందని 10 గంటలు తగ్గించాలని పదిహేను వేల మంది కార్మికులు రోడ్డు ఎక్కి ధర్నా చేశారు .1909 అంతర్జాతీయ మహిళ దినోత్సవ ఏర్పాటు చేశారని అన్నారు. సఖి అడ్వకేట్ అంజలి సఖి అడ్మిన్ సరిత మాట్లాడుతూ మహిళలు సమస్యలకు భయపడుద్దని కౌన్సిలింగ్ సఖీ ద్వారా ఇస్తామని 1908 కి ఏ సమయంలోనైనా మీరు కాల్ చేస్తే సఖి సభ్యులు మీ ముందు ఉంటారని మీకు అండగా సఖి ఉంటుందని అన్నారు . నైన్ టీవీ సీనియర్ జర్నలిస్ట్ ధనలక్ష్మి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం మన తెలంగాణ అనే కాదు ఆంధ్ర ఢిల్లీ ఇతర రాష్ట్రాలు దేశాలు అమెరికా ఇటలీ ఫ్రాన్స్ ఇలా అన్ని దేశాల్లో అంతర్జాతీయంగా జరుపుకునే పండుగ అంతర్జాతీయ మహిళా దినోత్సవం అని అన్నారు . మహిళలు స్ఫూర్తిగా తీసుకొని చేయి చేయి కలుపుదాం మహిళలకు చేయూత నిద్దాం అనే నినాదంతో అందరం ఐకమత్యంగా కదులుదాం కలిసి పని చేద్దాం అనే పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో తెలంగాణ వీరనారీ మహిళా సంఘం జిల్లా నాయకత్వం సిహెచ్ సత్యవతి , భూక్య మణి , ఇనపనూరి నాగలక్ష్మి , తిప్పర్తి రమ్య , కటకం వెంకటలక్ష్మి , వరద లలిత ,మండల్ భవాని , చాట్ల సునీత ,భవాని ,బి కోటేశ్వరి ,ఐదవ డివిజన్ బల్లేపల్లి జవాను విజయ , దైతా ప్రవల్లిక ,నిమ్మ తోట రోజా , బాదావత్ బాలాజీ , హోమం రైట్స్ రాష్ట్ర అధ్యక్షులు మంచు కిరణ్ కుమార్ , జాన్ వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

# భద్రగిరి మార్ట్‌కు ట్యాగ్‌లైన్ సూచించండి

## పురస్కారం పొందండి - ఐటీడీఏ పీవో బి. రాహుల్



**భద్రాచలం ,మార్చి 07 (మీడియా టుడే):**

భద్రాచలం పట్టణంలో ఐటీడీఏ భద్రాచలం ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభం కానున్న భద్రగిరి మార్ట్ లో అంతరంగ అటవీ ప్రాంతాలలో నివసించే స్థానిక గిరిజనులు సేంద్రియ పద్ధతుల్లో తయారు చేసే పలు ఉత్పత్తులను ఈ మార్ట్ ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. శనివారం భద్రాచలం పట్టణంలో అతి త్వరలో ప్రారంభం కానున్న గిరి మార్ట్ పనులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివాసి గిరిజన గ్రామాలలో ఎటువంటి కల్తీ లేని నాణ్యతగా ఉండే పచ్చళ్ళు, జూట్ బ్యాగులు, మిల్లెట్ లడ్డూలు, బిస్కెట్లు వంటి గిరిజన మహిళల స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులతో పాటు గ్రీన్ గ్రామ్, రెడ్ గ్రామ్, నువ్వులు, కందిపప్పు, పెసరపప్పు, మక్కలు, మినుములు వంటి సేంద్రియ ధాన్యాలు కూడా విక్రయించబడనున్నాయని అన్నారు. అలాగే ప్రజల దైనందిన అవసరాలకు అవసరమైన సాధారణ కిరాణా సరుకులు కూడా ఈ మార్ట్‌లో అందుబాటులో ఉండనున్నాయని, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి వచ్చే భక్తులకు ,స్థానిక ప్రజలకు నాణ్యమైన స్థానిక ఉత్పత్తులు ఒకే చోట లభించేలా ఈ మార్ట్‌ను ఏర్పాటు చేస్తున్నామని ఆయన అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రజలు ఈ కొత్త మార్ట్‌కు ఆకర్షణీయమైన్ ఖస్త్రశ్రీఅవ మరియు ూశీస్త్రశీ సూచించాలని కోరుతున్నామని ఆయన అన్నారు. ఆసక్తి గల వారు తమ సూచనలు తేదీ. 12.03.2026 లోపు ఖజూశీస్త్ర.ఎఎఎ ఏస్త్రమెఅశ్రీ .ఛశీఎ మెయిల్ మరియు 7780310977 ఫోన్ నెంబర్ కు పంపించి ఈ మహత్తరమైన కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# భూదాన్ పేరిట కోట్లు దోచిన ముఠా

**కమిటీ సభ్యులమంటూ నిరుపేదల నుంచి రూ.3 కోట్లు వసూళ్లు - నకిలీ పట్టాలు, అక్రమ కేటాయింపులు బట్టబయలు**

**వెలుగుమట్ల భూ వివాదంపై ఇప్పటికే 19 కేసులు - ఇప్పటివరకు 9 మంది అరెస్ట్... కొనసాగుతున్న దర్యాప్తు**





**మీడియా టుడే ఖమ్మం ఆర్సి**

ఖమ్మం : భూదాన్ భూముల్లో ఇంటి స్థలాలు ఇప్పిస్తామని చెప్పి నిరుపేదలను మోసం చేసిన ముఠా వ్యవహారం ఖమ్మంలో వెలుగుచూసింది. యూసిసీఆర్ఎల్ (యంఎల్) ఓపీడీఆర్ భూదాన్ కమిటీ సభ్యులమని తప్పుడు ప్రచారం చేస్తూ వెలుగుమట్ల ప్రాంతానికి చెందిన నిరుపేదల నుంచి సుమారు 3 కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ వ్యవహారంపై ఇప్పటివరకు 19 కేసులు నమోదు చేసి 9 మందిని అరెస్ట్ చేసినట్లు అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు తెలిపారు. భూదాన్ యజ్ఞ బోర్డు స్టాండింగ్ కౌన్సిల్ నిర్వహించిన సమగ్ర విచారణలో నకిలీ పత్రాలు, అక్రమ కేటాయింపులు జరిగినట్లు తేలిందని చెప్పారు. నిందితులు ఒక ముఠాగా ఏర్పడి తమను ఓపీడీఆర్ భూదాన్ కమిటీ సభ్యులమని ప్రచారం చేసి అమాయక ప్రజలను నమ్మబలికినట్లు పేర్కొన్నాం

**ఒక్కొక్కరి నుంచి భారీ వసూళ్లు**

భూదాన్ భూముల్లో ఇంటి స్థలాలు ఇప్పిస్తామని చెప్పి పేద ప్రజలను ప్రలోభపెట్టినట్లు పోలీసులు తెలిపారు. ఒక్కొక్కరి నుంచి 50 వేల నుంచి 1 లక్ష రూపాయల వరకు వసూలు చేసినట్లు వెల్లడించారు. ఈ విధంగా అనేక మంది నిరుపేదలు మోసపోయారని చెప్పారు. వసూలు చేసిన డబ్బును నిందితులు తమ స్వప్రయోజనాలకు వినియోగించుకున్నట్లు గుర్తించారు. ఈ విషయంపై ఎవరైనా ప్రశ్నిస్తే తమ వద్ద భూదాన్ పట్టాలు ఉన్నాయని, హైకోర్టు ఆదేశాలు కూడా ఉన్నాయని చెప్పి బాధితులను నమ్మబలికినట్లు పోలీసులు తెలిపారు. ఇదే ముఠాపై గతంలో కూడా సుమారు 15 కేసులు నమోదైనట్లు వెల్లడించారు.

**బాధితులకు ప్రభుత్వం అండ**

వెలుగుమట్ల భూదాన్ భూముల విషయంలో ప్రభుత్వం బాధితులకు అండగా నిలుస్తుందని అధికారులు తెలిపారు. మోసపోయిన ప్రజల నుంచి వసూలు చేసిన డబ్బును నిందితుల నుంచి రికవరీ చేసి తిరిగి బాధితులకు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. భూదాన్ భూముల్లో అర్హులైన నిరుపేదలకు స్థలాలు కేటాయించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కేసులకు సంబంధించి ఖమ్మం ఖానాపూర్ హవేలీ పోలీస్ స్టేషన్‌తో పాటు సత్తుపల్లి, కొణిజర్ల పోలీస్ స్టేషన్లలో కూడా కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు కొనసాగుతోందని, మోసపోయిన వారు ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు

**రాయికల్-మీడియా టుడే-మార్చి 7:**

రాయికల్ పట్టణంలోని 2వ వార్డులో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక-99రోజుల కార్యాచరణ కార్యక్రమములో భాగంగా శనివారం అదనపు కార్మికులను ఎంగేజి చేసుకొని ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా డ్రెయిన్ల పూడికతీత, పిచ్చి మొక్కల తొలగింపు, వార్డులోని రోడ్లు శుభ్రం చేయుట వంటి పనులు చేశారు. అదనపు కలెక్టర్ రాజా గౌడ్ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్




చైర్మన్ కట్కం రవీందర్, మున్సిపల్ కమీషనర్ కీర్తి నాగరాజు, కౌన్సిలర్ భుక్యా రాకేష్ నాయక్, నాయకులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## కీసర సర్కిల్ ఆవరణలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు




**మీడియా టుడే/మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా: కీసర సర్కిల్ మార్చ్ 07**

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమములో భాగముగా కీసర సర్కిల్ పరిధిలో శనివారం జనన మరణ ధ్రువీకరణ దరఖాస్తులు 15, రెవెన్యూ సెక్షన్ దరఖాస్తులు 12, టౌన్ ప్లానింగ్ సెక్షన్ దరఖాస్తులు 14 మొత్తం 41 దరఖాస్తులను క్లియర్ చేయడం జరిగిందని ఇంచార్జ్ డిప్యూటీ కమిషనర్ భోగేశ్వరరావు తెలిపారు.

## ఎస్పీ ఆదేశాల మేరకు శబ్ద కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకుంటున్నాము



**జగిత్యాల మీడియా టుడే- మార్చ్ 7**

జగిత్యాల పట్టణ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మల్లేష్ శబ్ద కాలుష్య వాహనాలపై తనదైన శైలిలో కొరడా జులిపిస్తున్నారు. ప్రతిరోజు ఆయన శబ్ద కాలుష్యంతో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న ద్విచక్ర వాహనాలను పట్టుకొని ఫైన్ వేయడమే కాకుండా ఆ సైలెన్సర్లను వాహనాల నుండి తొలగింప చేస్తున్నారు దీనిపై ఆయన మాట్లాడుతూజగిత్యాల జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, మరియు పై అధికారు ల సూచనలను సారం ప్రతిరోజు ద్విచక్ర వాహనాలను పరిశీలించి వాటి శబ్ద కాలుష్య నియంత్రణ చర్యలను తీసుకుంటున్నాం..అదనంగా ఎవరైనా సైలెన్సర్లను ఏర్పాటు చేసుకొని శబ్దాలను చేసినట్లయితే వారికి ఫైన్లు విధించడం జరుగుతుంది. .అంతేకాకుండా ఆ సైలెన్సర్లను తీసుకోవడం జరుగుతుంది. వాహన దారులు అందరూ కంపెనీల నుండి వచ్చిన సైలెన్సర్లు వారి బాధ్యతగా వాడాలి..అని అన్నారు..ట్రాఫిక్ ఎస్ఐ పనితీరుపట్ల పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు

## దివ్యాంగ విద్యార్థికి లాప్‌టాప్ అందజేత

### హైకోర్టు జడ్జి నందికొండ నర్సింగరావు అందజేత




**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ . మీడియా టుడే : మార్చి 07**

సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని దాచారం గ్రామానికి చెందిన మరవేణి చంద్రశేఖర్ యాదవ్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ ఆర్కియాలజీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. దివ్యాంగుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించే ఉపకార పరికరాల పథకం కింద చంద్రశేఖర్ యాదవ్‌కు లాప్‌టాప్ మంజూరు చేశారు.రాజన్న సిరిసిల్ల జిల్లా కోర్టు నూతన భవన నిర్మాణ పూజా కార్యక్రమం సందర్భంగా హైకోర్టు జడ్జి నందికొండ నర్సింగరావు చేతుల మీదుగా లాప్‌టాప్‌ను అందజేశారు.ఈ సందర్భంగా చంద్రశేఖర్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసిన లాప్‌టాప్ తన ఉన్నత విద్యాభ్యాసంతో పాటు ప్రభుత్వ పోటీ పరీక్షలకు సిద్ధమవ్వడానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే దివ్యాంగుల బ్యాక్లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా డీడబ్ల్యూఓ లక్ష్మీరాజ్యం పాల్గొన్నారు.

## శాత్రాజుపల్లి అంగన్వాడి కేంద్రంలో అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమం

**చిన్నారులకు యూనిఫాంలు పంపిణి చేసిన 2వ వార్డు కౌన్సిలర్ ఏనుగు జ్యోతి తిరుపతి రెడ్డి**



**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ . మీడియా టుడే : మార్చి 07 :**

వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడీ లెవల్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం , అక్షరాభ్యాసం నిర్వహించారు ఈ కార్యక్రమానికి 2వ వార్డు కౌన్సిలర్ ఏనుగు జ్యోతి తిరుపతి రెడ్డి హాజరై చిన్నారులతో అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అంగన్వాడి కేంద్రంలోని పిల్లలకు యూనిఫాంలను పంపిణీ చేశారు.ఇటీవల నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ ఏనుగు జ్యోతి తిరుపతి రెడ్డి ని అంగన్వాడీ టీచర్లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సిబ్బంది, విధ్యార్థుల తల్లిదండ్రులు స్థానికులు పాల్గొన్నారు.

# నీతి నిజాయితీకి,అభివృద్ధికి మారుపేరు తుమ్మల

**తుమ్మల మీద నిందలు వేస్తే సహించేదిలేదు**

**జిల్లా కాంగ్రెస్ కమిటీ ఖమ్మం కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి**

**మీడియా టుడే ఖమ్మం ఆర్సి**


ఖమ్మం : శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో జరిగిన సమావేశంలో నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి మాట్లాడుతూ మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అవాకులు చెవాకులు మానుకోవాలని హితవు పలికారు.బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, పువ్వాడ అజయ్ కుమార్ భూదాన్ పేదలను కల్లబొల్లి కబుర్లతో మభ్యపెడుతున్నారని ,ఈ భూములపై గత ప్రభుత్వ హయాంలో కోర్ట్ లో వేశారని అట్టి తీర్పు ఈనాటికి వెలువడిందని, మాజి మంత్రి పువ్వాడ పది సంవత్సరాలు కళ్ళు మూకొన్నావా,భూదాన్ పేదల దగ్గర గడ్డలలగా మారి వారిని మభ్యపెట్టి వారి దగ్గర డబ్బులు పోగుచేసుకొన్నారని,ఇకనైనా అనవసర ఆరోపణలు, తుమ్మల మీద నిందలు వేయడం మాని అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.అదే విధంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నాలుగు దశాబ్దాల చరిత్ర గల నీతి నిజాయితీకి జిల్లా అభివృద్ధికి ఏ విధంగా పాటుపడ్డారో జిల్లా ప్రజలందరికీ తెలుసని, తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం నియోజక వర్గంలో




గెలిచినప్పటి నుండి నియోజకవర్గం దినదినాభివృద్ధికి అహర్నిశలు పాటు పడుతున్నారన్నారు. అటువంటి వారిపై నిందలు వేయటం ఆకాశంపై ఉమ్మి వేసిన చందంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు నగర ఐ యన్ టి యు సి అద్యక్షులు నరాల నరేష్ నాయుడు, నగర ఓ బి సి సెల్ అద్యక్షులు బాణాల లక్ష్మణ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కల్వకుంట్ల గోపాల్, కన్నం వైష్ణవిప్రసన్న కృష్ణ పాల్గొన్నారు.

# గౌరవెల్లి ప్రాజెక్టు నుండి రైతులకు సాగు నీరందించాలి

**-మాజీ ఎమ్మెల్యే వోడితల సతీష్ కుమార్**




**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ : మీడియా టుడే , మార్చి 07 :**

మంత్రి పొన్నం ప్రభాకర్ పార్టీలకతీతంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేయాలని, పక్షపాత వైఖరి మానుకొని చిత్తశుద్ధితో గౌరవెల్లి ప్రాజెక్టు నుండి రైతులకు సాగు నీరు అందించాలని, అభివృద్ధి కోసం పూర్తి స్థాయిలో సహకరిస్తామని హుస్నాబాద్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే వోడితల సతీష్ కుమార్ అన్నారు. చిగురుమామిడి మండల కేంద్రంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఎన్నికల్లో ప్రజలకు ఎన్నో వాగ్దానాలు చేసి రెండు సంవత్సరాలు పూర్తయినప్పటికీ అరకొర పనులు చేసి ప్రజలను మభ్యపెడు తున్నారని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో పార్టీలకతీతంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. చిగురుమామిడి, సైదాపూర్ మండలాలకు తోటపల్లి రిజర్వాయర్ ద్వారా 23 వేల ఎకరాల కు సాగునీరు అందించామని అన్నారు. ప్రతిపక్ష నాయకుడు సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి సైతం గోదావరి జలాలను చూసి సొంత గ్రామం రేకొండలో సంతోషం వ్యక్తం చేశారని గుర్తు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం మాటల్లో తప్ప చేతుల్లో పనులు లేవని ఎద్దేవా చేశారు. పార్టీ గుర్తులకు అతీతంగా ప్రజలతో ఎన్నుకోబడిన సర్పంచ్లకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు ఇవ్వాల్సిన అవసరం ఉందని, కేవలం కాంగ్రెస్ కండువా కప్పుకున్న వారికి మాత్రమే గ్రామాల్లో నిధులు మంజూరు చేయడం ఏంటని మంత్రిని ప్రశ్నించారు. నిధులు మంజూరు చేయని సర్పంచులు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకోబడలేదా అని ప్రశ్నించారు. ఆ గ్రామాలు నియోజకవర్గంలో లేవా అని అన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు ఎక్కువ గెలిచారని అన్నారు.పాత బిల్లులు ఇవ్వకుండా పనులు ఎట్లా చేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ వారికి తప్ప మిగతా వారికి పనులు ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో గత ఎమ్మెల్యేలు ఇలాంటి విధంగా వ్యవహరించ లేదని అన్నారు. బాధ్యతను విస్మరిస్తే ధర్నాలు, ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. మాజీ సీఎం కేసీఆర్ పాలనలో చిగురుమామిడి, సైదాపూర్ మండలాలకు సాగునీరు అందించామని చెరువులు, కుంటలు నింపి రైతుల పంటలు దిగుబడి అధికంగా వచ్చేలా కృషి చేశామన్నారు. మిషన్ భగీరథ ద్వారా త్రాగు నీరు అందించామన్నారు. రైతుల అవసరాలకు అనుగుణంగా కెనాల్ ద్వారా పంటలకు సాగునీరు అందించామన్నారు.మెంతా తుఫాన్ తో నష్టపోయిన రైతుల సమస్యలు పరిష్కరిస్తామని నియోజకవర్గంలో సీఎంను తీసుకువచ్చి నష్టపరిహారం అందిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. రైతుల సమస్యలను మంత్రి మరిచిపోయారని ఎద్దేవా చేశారు. రైతులను ఆదుకోవాల్సిన అవసరం కాంగ్రెస్ ప్రభుత్వం పై ఉందన్నారు. 24 గంటల కరెంట్ సరఫరా గత ప్రభుత్వంలో ఉండేదని, దాంతో పంటల సాగు దిగుబడి పెరిగింద న్నారు. ప్రస్తుతం కరెంటు ఇబ్బందులు ఎదుర్కొని రైతులు గందరగోల పరిస్థితిలో ఉన్నారన్నారు. రైతులకు సరిపడా విద్యుత్ అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్ నియోజకవర్గంలో రైతులకు సరిపడా యూరియాను అందించడంలో ప్రభుత్వం చేతులెత్తేసిందని, రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కున్నారన్నారు. చెప్పులు లైన్లో పెట్టాల్సిన పరిస్థితి దాపురించిందని అన్నారు. మంత్రిగా ఉన్న పొన్నం ప్రభాకర్ కు ఎమ్మెల్యేగా పనిచేసిన నేను సమస్యలపై ప్రశ్నించడం అతని పనితీరుకు నిదర్శనం అన్నారు. బిఆర్ఎస్ పాలనలో గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసినప్పటికీ కాంగ్రెస్ నాయకులు కేసులు వేసి పనులను అడ్డుకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. మంత్రిగా ఉండి గౌరవెల్లి ప్రాజెక్టు నీరు ఎందుకు పంపిణీ చేయడం లేదని ప్రశ్నించారు.ఎంపీగా ఉండి ఏమి చేయలేదని, మాటలకే పరిమితం అవుతూ మోటార్ సైకిల్ పై గట్టుపై తిరగడమేనా అని ప్రశ్నించారు. నీటి ఇబ్బందిని పరిష్కరించలేని ఎడల మంత్రి చేతగానితనమే అని ప్రజలు భావిస్తారని అన్నారు. హైదరాబాద్ కు ఇన్చార్జి మంత్రిగా పరిమితమేనా లేక నియోజకవర్గం అభివృద్ధి ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. పెండింగ్లో ఉన్న కుల సంఘాల భవన నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలని, ప్రజా పాలన పేరుతో 99 రోజుల కార్యక్రమాన్ని వివక్ష లేకుండా ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రధాని కావాలని కోరుకుంటున్నానని, మైదానం విడిచిపెట్టి సాము చేయకండని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య ,మాజీ అధ్యక్షుడు రామోజు కృష్ణమాచారి, సింగిల్ విండో మాజీ చైర్మన్ జంగా రమణారెడ్డి, ఆర్‌బీఎస్ మండల మాజీ అధ్యక్షుడు పెనుకుల తిరుపతి, సాంబారి కొమురయ్య, సర్పంచ్లు ఆకవరం భవాని, సన్నీల కవిత, సాంబారి భారతమ్మ, ఒంటెల కిషన్ రెడ్డి, బోయిని రమేష్, నాయకులు కర్వేద మహేందర్ రెడ్డి, పెసరి రాజేశం,మండల ప్రచార కార్యదర్శి బెజ్జంకి రాంబాబు, బీసీ సెల్ అధ్యక్షులు అనుమాన సత్యనారాయణ, మైనార్టీ సెల్ అధ్యక్షులు సర్వర్ పాషా, గ్రామ శాఖ అధ్యక్షులు ఆకవరం శివప్రసాద్, కత్తుల రమేష్, యాల జనార్దన్ రెడ్డి, బుర్ర తిరుపతి, మాజీ సర్పంచులు బెజ్జంకి లక్ష్మణ్, సన్నీల వెంకటేశం, జక్కుల రవి, కానుగంటి భూమిరెడ్డి, ఉప సర్పంచ్ కాశ బోయిన విజయలక్ష్మి, రాజు, మహంకాళి కొమురయ్య, శ్యామకూర సంపత్ రెడ్డి, నాగేల్లి రాజిరెడ్డి, చెరుకు సంజీవ్ కుమార్, మారేళ్ళ కొమురయ్య , దొనపాటి కృష్ణారెడ్డి , లక్ష్మణ్,వివిధ గ్రామాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

## చంద్రంపేట పాఠశాలలో ముందస్తుగా మహిళా దినోత్సవ వేడుకలు



**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ : మీడియా టుడే , మార్చి 07 :**

వేములవాడ మండలం చంద్రం పేట లో మార్చ్ 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం రోజున చంద్రంపేట ఉన్నత పాఠశాలయందు పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయనులకు మరియు సిబ్బంది మరియు మధ్యాహ్న భోజన కార్మికులకు మహిళా దినోత్సవం పురస్కరించుకుని పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు కొండికొప్పుల రవి , మధుసూదన్ ,అనిల్ కుమార్ గారి ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు.స్త్రీ లేకుంటే జననం లేదు స్త్రీ లేకుంటే సమాజం లేదు స్త్రీ భవిష్యత్తు లేదు అని స్త్రీల యొక్క ఔన్నత్యాన్ని కొనియాడడం జరిగింది.. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కే.పద్మ గారికి, అంజలి,మిరియం, దేవమ్మ, లత, జమున, అఖిల లను ఘనంగా సత్కరించారు

## గంజాయి అమ్ముటకు ప్రయత్నిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలింపు

**సిరిసిల్ల రూరల్ సిఐ కదిరే నాగేశ్వర రావు**



**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్. మీడియా టుడే : మార్చి 07:**

ఇల్లంతకుంట మండలం లో తరచూ ఇద్దరు వ్యక్తులు గంజాయి సేవిస్తూ మరియు అమ్ముటకు ప్రయత్నిస్తున్న వ్యక్తులు మండలంలోని రామోజీపేట గ్రామానికి చెందిన చింతమడక అజయ్ , పెద్ద లింగాపూర్ గ్రామానికి చెందిన కోడిముంజ సాయి అనే ఇద్దరు వ్యక్తులు స్నేహితులు వీరు గత కొంతకాలంగా గంజాయి సేవిస్తూ అలాగే చుట్టుపక్కల గ్రామాలలో యువతకు గంజాయిని చేరవేస్తూ డబ్బులు సంపాదించుకుంటున్నారు. అదే క్రమంలో శనివారం రోజు గంజాయినీ అమ్ముటకు రాగా అనంతారం శివారులో పట్టుకొని వారి వద్ద నుండి 65 గ్రాముల గంజాయిని సీజ్ చేసి కేసు నమోదు చేసి తదుపరి విచారణ చేపట్టిన సిరిసిల్ల రూరల్ సిఐ కదిరె నాగేశ్వరరావు నిందితులను జ్యుడీషియల్ ముందు హాజరు పరచి రిమాండ్ కు తరలించడం జరిగిందని సీఐ తెలిపారు

మీడియా టుడే
ఆదివారం, మార్చి 8, 2026

## పదవతరగతి విద్యార్థులకు పెన్నుల పంపిణీ




**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ : మీడియా టుడే , మార్చి 07 :**
కరీంనగర్ జిల్లా చొప్పదండి పట్టణం లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు ఆర్నకొండ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదవతరగతి విద్యాభ్యాసం పూర్తిచేసుకుని పబ్లిక్ పరీక్షలకు హాజరు కాబోతున్న విద్యార్థులకు శ్రీనివాస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం రెండేసి పెన్నుల చొప్పున వారికి పంపిణీ చేశారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలలలో ప్రశ్నలకు చక్కగా జవాబులు రాసి ఉత్తమఫలితాలను సాధించాలని సంస్థ సభ్యులు పేర్కొన్నారు.

## బైక్‌లో పెట్టిన రైతు రమేష్ నాయక్ పొలం పాస్ బుక్ మిస్సింగ్

**దొరికినచో సమాచారం ఇవ్వండి బాధితుడు రమేష్ నాయక్**

**మీడియా టుడే కల్వకుర్తి నియోజకవర్గ ప్రతినిధి మార్చి 07**



కల్వకుర్తి మండలం లోని వెంకటాపూర్ తండా గ్రామపంచాయతీకి చెందిన ఇస్లావత్ రమేష్ నాయక్ చెందిన పొలం పాసుబుక్కు మిస్సయిందని రైతు రమేష్ నాయక్ ఆవేదన చెందారు.వివరాలకి వెళితే వెంకటాపూర్ తండా గ్రామ పంచాయతీకి రైతుబిడ్డఇస్లావత్ రమేష్ నాయక్ చెందిన పొలం పాసుబుక్,ఎ030600 30298,,ఖాతా నెంబర్ 392 గల పొలం పాస్ బుక్ తన బైక్ లో పెట్టుకుని కల్వకుర్తిఎమ్మార్వో ఆఫీస్ కు పని నిమిత్తం వెళ్లడం జరిగింది అని,ఎమ్మార్వో ఆఫీస్ ముందల బైకు పార్కు చేసి ఆఫీస్ లోపలికి వెళ్లి పని ముగించుకొని వచ్చి చూడక బైక్లో పొలం పాస్బుక్ కనిపించలేదని రైతుఇస్లావత్ రమేష్ నాయక్ మీడియాకు తెలిపారు.ఎవరికైనా దొరికితే వెంటనే ఈఫోన్ నంబర్ కు 9110740596 సమాచారం అందించాలని బాధితుడు కోరారు.

## హనుమాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య శిబిరానికి విశేష స్పందనతో వైద్య శిబిరాన్ని పరిశీలించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత



**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్. మీడియా టుడే : మార్చి 07**
:ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల ఆరోగ్య కార్యక్రమం కింద జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత శనివారం హనుమాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్య నిపుణులచే నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన రావడం తో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని మహిళలు మరియు ప్రజలు ఈ ప్రత్యేక వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు అక్కడి వైద్య అధికారిణి డాక్టర్ దివ్యశ్రీతో పాటు వైద్య సిబ్బందికి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచనలు చేశారు

## సిరిపురం గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ముందస్తుగా మహిళా దినోత్సవ వేడుకలు



**మీడియా టుడే ప్రతినిధి కృష్ణ మార్చి 7 కోదాడ (నడిగూడెం)**
నడిగూడెం మండలం సిరిపురం గ్రామంలో ప్రాథమిక పాఠశాల-2లో శనివారం ముందస్తుగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన నూతన ఎంఈఓ.వనం సత్యనారాయణ మాట్లాడుతూ- మహిళలు,పురుషులతో సమానంగా అన్ని రంగాలలో ప్రగతి సాధిస్తున్నారన్నారు.ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళల్లో కాలానుగుణంగా చైతన్యం వస్తుందన్నారు.అలాగే మహిళల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు.అనంతరం మహిళ టీచర్లను శాలువలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం.బుర్రి శ్రీనివాసరావు,సీనియర్ ఉపాధ్యాయులు కె.సుజాత, వి.జ్యోతి, వై.వెంకన్న, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మొక్క.నాగలక్ష్మి, అంగన్వాడీ టీచర్ నేలమరి.శైలజ, తల్లులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సెల్ ఫోన్లకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను సాధించాలి

**-మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల**



**మీడియా టుడే కల్వకుర్తి నియోజకవర్గ ప్రతినిధి మార్చి 07**
ప్రభుత్వం విద్యారంగానికి ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తించి,విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ అన్నారు.'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'99 రోజుల కార్యాచరణలో భాగంగా శనివారం స్థానిక మోడల్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా అందరికీ ప్రపంచ స్థాయి విద్యను అందించేందుకు ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను అందుబాటులోకి తెస్తోందని, విద్యార్థులు సెల్ ఫోన్ల వ్యామోహంలో పడకుండా భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు. కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు బృంగి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా సావిత్రి బాయి పూలే, ఫాతిమా షేక్ వంటి మహనీయుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ షేక్ మహమూద్, వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి,కౌన్సిలర్లు మబ్బు రామరాజు, ఏజాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి,సర్పంచ్ లు రమేష్ నాయక్, రవి గౌడ్,కాంగ్రెస్ నాయకులు ఇంజమురి కరణ్, బాల్ జంగయ్య,పడకంటి వెంకటేష్,దున్న సురేష్, శ్రీశైలం, మహేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచంలో ప్రేమకు చాలా నిర్వచనాలు ఉన్నాయి

**కానీ కన్న కూతురిపై తండ్రి ప్రేమకు మాటలు సరిపోవు.**

**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్: మీడియా టుడే , మార్చి 07 :**
రోజూ చిన్న చిన్న విషయాలకే కోప్పడే తండ్రి, ఆ కోపం వెనుక దాగి ఉన్న ప్రేమ పెళ్లి రోజు కట్టలు తెంచుకుని కన్నీళ్లుగా బయటపడుతుంది. నిన్నటిదాకా చేతి పట్టుకుని నడిపిన కూతురు కోసం, ఈ రోజు పరిచయం లేని చిన్న వయసు అల్లుడి కాళ్లు పట్టుకుంటాడు తండ్రి. మనతో సమాన వయసున్న వియ్యంకుడి ముందు కూడా, తన పరువు, ప్రతిష్ట, గౌరవం అన్నీ పక్కన పెట్టి చేతులు పట్టుకుని బ్రతిమలాడతాడు కాళ్లు పట్టుకుని మరియు వేడుకుంటాడు“నా బిడ్డను చక్కగా చూసుకోండి” అని వేడుకుంటాడు. ప్రతి మనిషికి గౌరవం ఉంటుంది.. పౌరుషం ఉంటుంది. ఆత్మాభిమానం ఉంటుంది.కానీ కూతురు సుఖం ముందు అవన్నీ మౌనమవుతాయి. ముక్కు ముఖం తెలియని వాళ్ల కాళ్లపై పడటం బలహీనత కాదు.తండ్రి ప్రేమ యొక్క అత్యున్నత రూపం. కూతురు పెళ్లి అంటే ఆభరణాలు కాదు.అప్పగింత.ప్రాణం పెట్టి పెంచిన జీవితాన్ని విశ్వాసంతో ఇంకో ఇంటికి అప్పగించటం. కాళ్లు పట్టుకున్నది ఆడబిడ్డ తండ్రి కాదు. ఆ తండ్రి గుండె.ఎంతైనా మగపిల్ల తల్లిదండ్రులు అదృష్టవంతులు ఆడపిల్ల కోడలు రూపంలో వాళ్లకి జీవితాంతం సేవలు చేయటానికి మంచి చెడులు చూడటానికి మరియు బాధ్యతలు నిర్వర్తించటానికి వాళ్ల సంతాన అభివృద్ధి కోసం వాళ్లతోనే 80 సంవత్సరాలు ఉంటుంది వాటితో పాటు కట్నాలు కానుకలు ఇవన్నీ సాంప్రదాయంగా వచ్చేవైనా తీసుకొస్తూనే మంచిగా ఉంటూనే ఉంటుంది అదే కన్న తల్లిదండ్రుల దగ్గర మాత్రం కేవలం పెళ్లయ్యే వరకు సుమారు 20 సంవత్సరాలు ఉంటుంది అబ్బా ఎంత అదృష్టవంతులు అండి మగపిల్లల ను కన్న తల్లితండ్రులు అని ఒక్కొక్కసారి అనిపిస్తూ ఉంటుంది . దయచేసి మరోలా అనుకోకండి ఇది మనసులో నుంచి వస్తున్న మాటలు కేవలం అభిప్రాయం మాత్రమే ఎవర్ని ఉద్దేశించి కాదు ఇంకోలాగా కాదు ఈ వీడియో చూడంగానే ఇలా స్పందించాలని అనిపించింది. అంతే దయచేసి మరోలా అనుకోవద్దు



## మెను ప్రకారం బోజనం అందించాలి



**రాయికల్-మీడియా టుడే-మార్చి 7:**
విద్యార్థులకు మెను ప్రకారం బోజనం అందించాలని జడ్పీ సీఈవో గౌతమ్ రెడ్డి సూచించారు. రాయికల్ మండలం అల్లీపూర్ మహాత్మా జ్యోతిబా బాలుర పాఠశాలను శనివారం జడ్పి సీఈవో గౌతమ్ రెడ్డి తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వీరి వెంట డిప్యూటీ సిఈఓ నరేష్, ఎంపిడిఓ చిరంజీవి, కార్యదర్శి, పాఠశాల సిబ్బంది తదితరులున్నారు.

## రేపాక జామ మస్జిద్‌లో కులమతాలకు అతీతంగా ముస్లిం సోదరుల ఇఫ్తార్ విందు



**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్.మీడియా టుడే : మార్చి 07:**
ఇల్లంతకుంట మండలం లోని రేపాక గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఇఫ్తార్ విందు జామ మస్జిద్ లో ఏర్పాటు చేయడం జరిగింది ఈకార్యక్రమంలో గ్రామంలో ఉన్న పలువురు కులస్తులు ఇఫ్తార్ విందు లో పాల్గొన్నారు....జామ మస్జిద్ మొలిసాబ్ మాట్లాడుతూ మత సామరస్యమే మన భారతీయత లక్ష్యం అని భక్తి శ్రద్ధలతో దసరా పండుగ రంజాన్ పండుగ జరుపుకుంటామని అన్నారు. భారతదేశం అంటేనే భిన్న మతాలు, కులాలు, వర్గాల కలయిక అని, భిన్నత్వంలో ఏకత్వం అన్నారు. ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఉపవాసదీక్షల్లో పాల్గొంటారని, పండుగలు మన జీవన ప్రవంతిలో భాగమై మన జాతీయతకు, సంస్కృతీ వికాసానికి దోహదం పడతాయని ఏ మతానికి సంబంధించినదైనా సరే దాని వెనుక ఒక సందేశం దాగి వుంటుందన్నారు ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే రంజాన్ పండుగ సైతం ఇదే హితాన్ని మానవాళికి అందిస్తుందన్నారు.ముస్లీం సోదర, సోదరీమణులకు రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా వారికి అల్లా ఆశీస్సులు ఉండాలని శుభాకాంక్షలు తెలియజేశారుఈ కార్య క్రమంలో ఎండి సలీం .షరీఫ్.రెహన్. ..అహద్.ఆఫ్రీద్,ఆసిఫ్.. గొడిసెల గోపాల్ . గుర్రం రాజిరెడ్డి నర్సయ్య ..తదితరులు పాల్గొన్నారు

## చిలుకూరులో ఘనంగా మహిళా దినోత్సవం వేడుకలు




**మీడియా టుడే ప్రతినిధి కృష్ణ మార్చి 7 కోదాడ (చిలుకూరు)**
చిలుకూరు మండల కేంద్రంలో శనివారం రోజు ముందస్తుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పీఎం శ్రీ జెడ్ పి హెచ్ ఎస్ ఉన్నత పాఠశాల చిలుకూరు నందు పాఠశాల మహిళా ఉపాధ్యాయుని బోధ నేతర సిబ్బందిని సన్మానించారు మహిళా దినోత్సవం మహిళలు సామాజికంగా ఆర్థికంగా సాంస్కృతికంగా మరియు రాజకీయ రంగాలలో విజయాలు సాధించాలని ఆ విజయాల ద్వారా గుర్తించబడాలని సమానమైన హక్కులు సమానత్వం సాధికారత కోసం మహిళలు పాటుపడాలని ఇల్లాలి చదువు ఈ జగతికి వెలుగుని నింపుతుందని మహిళ దినోత్సవ సందర్భంగా స్థానిక సర్పంచ్ శ్రీమతి కొల్లు పుల్లమ్మ నాగయ్య అన్నారు.. ఈ కార్యక్రమంలో రంజాన్ బి హెడ్మాస్టర్ రాజారాం మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## ఘనంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి జాతర మహోత్సవం



**రాయికల్-మీడియా టుడే-మార్చి 7:**
రాయికల్ మండలం చెర్లకొండాపూర్ గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి జాతర శనివారం ఘనంగా జరిగింది. స్వామి వారిని రథంపై చేర్చి గుడి చుట్టూ లాగారు. మాజీమంత్రి జీవన్ రెడ్డి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి దేవుని నారాయణ, సర్పంచ్ దేవుని రవి, ఉప సర్పంచ్ ఆర్మూర్ లక్ష్మీనారాయణ, చుక్కపొట్ల లక్ష్మీనర్సు, ఇందూరి శిరీష రాకేష్, అల్లకొండ సుదర్శన్, ఆకుల లక్ష్మీనారాయణ, ఆర్మూర్ లక్ష్మీనారాయణ గోపి రాజారెడ్డి, పిప్పోజి మహేందర్ బాబు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# వార్డుల్లో అధ్వానంగా సిసి రోడ్లు

**రాయికల్-మీడియా టుడే-మార్చి 7:**




రాయికల్ పట్టణంలో 9వ, 10వ వార్డుల్లో తాగు నీటి కోసం సిసి రోడ్లు త్రవ్వి పైపులైను వేశారు. రోడ్లు తవ్వి నెలలు గడుస్తున్నా ఇప్పటికి పనులు పూర్తి కాలేదు. మున్సిపల్ అధికారుల....గుత్తేదారు నిర్యక్షంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం కాంక్రీట్ వ్యర్థాలను తొలగించే వారు కూడా లేరు. సిసి రోడ్డు అధ్వానంగా ఉండటంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. నడవడానికి కష్టంగా ఉంది. సిసి రోడ్డుకు మరమ్మత్తులు చేయాలని అధికారులను..నూతన పాలకవర్గాన్ని ప్రజలు కోరుతున్నారు.

# అక్రమ ఇసుక, గ్రావెల్ రవాణాపై కఠిన చర్యలు

**-జిల్లాలో వాల్టా చట్టం కట్టుదిట్టంగా అమలు చేయాలి**

**-అక్రమ రవాణా వాహనాలపై మోటార్ వాహనాల చట్టం కింద కేసులు నమోదు చేయాలి**

**-జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య**



**సంగారెడ్డి స్టాఫ్ రిపోర్టర్:**

సంగారెడ్డి జిల్లాలో అక్రమంగా ఇసుక, కంకర, గ్రావెల్ రవాణాను కట్టుదిట్టంగా నియంత్రించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. వాల్టా చట్టంతో పాటు మోటార్ వాహనాల చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలని సూచించారు. శనివారం సంగారెడ్డి సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రెవెన్యూ, పోలీస్, మైనింగ్, భూగర్భజల శాఖ అధికారులతో అక్రమ ఇసుక, గ్రావెల్ రవాణా నివారణపై చర్చించారు. జిల్లాలో వాల్టా చట్టం అమలు, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం అవగాహన, భూభారతి దరఖాస్తుల పరిష్కారం, ఎస్ఐఆర్ నమోదు అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.జిల్లాలో ఇసుక, కంకర అక్రమ రవాణాపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖలు సంయుక్తంగా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అక్రమ రవాణాలో పాల్గొనే వాహనాలను సీజ్ చేసి మోటార్ వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఫిల్టర్ సాండ్ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, సహజ ఇసుకకు బదులుగా కృత్రిమంగా ఇసుక తయారు చేసి విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన ఇసుకను నిర్ణీత ధరలకే అందిస్తోందని, దీనిపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. నారాయణఖేడ్, జోగిపేట ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సాండ్ బజార్ల ద్వారా ఇసుకను నిర్ణీత ధరలలో అందిస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి జిల్లాలో ఇసుక కొరత లేదని స్పష్టం చేసిన కలెక్టర్, కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ నిర్మాణాలకు అవసరమైన ఇసుక, గ్రావెల్ వినియోగానికి తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలని సూచించారు. మొరం, గ్రావెల్ తవ్వకాలపై సాంకేతికంగా తనిఖీలు నిర్వహించి తవ్వకాల వివరాలు పరిశీలించాలని తెలిపారు. ఇప్పటివరకు నమోదు చేసిన అక్రమ రవాణా కేసుల వివరాలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియలో పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. భూభారతి దరఖాస్తులను వేగవంతంగా పరిశీలించి భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. కుల, ఆదాయ, నివాస ధృవపత్రాల జారీ ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకంపై మండల, గ్రామ స్థాయిలలో విస్తృత ప్రచారం నిర్వహించి అర్హులైన లబ్ధిదారులకు పథకం ప్రయోజనాలు అందేలా చూడాలని తెలిపారు. గ్రామ సభల ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, జిల్లా భూగర్భ శాఖ అధికారి ఎం. రఘుబాబు, రెవెన్యూ అధికారులు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆడపిల్ల పెళ్లికి సర్పంచ్ సునీతమ్మ కానుక

**-పార్టీలతో సంబంధం లేకుండా సర్పంచ్ ఎన్నికల్లో**

**ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న సర్పంచ్**

**అందోలు, మార్చి07,**

ఆడపిల్ల పెళ్లికి సర్పంచ్ సునీతమ్మ కానుకగా పట్టుచీరతో పాటు 6,116 రూ అందజేసి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. అందోలు మండలం కన్సాన్ పల్లి గ్రామంలో ఆర్ఎంపీ సంగమేశ్వర్ కూతురు పెళ్లి శనివారం జరుగనుంది. ఈ సందర్భంగా స్థానిక నాయకులు వెంకట్ రెడ్డి, ప్రవీణ్, మహిపాల్, క్రిష్ణ, బాలయ్య, బాల్ రాజ్ లతో కలిసి పెళ్ళి కూతురు ఇంటికి వెల్లి డబ్బులు, పట్టుచీర అందజేసారు. స్థానిక సర్పంచ్ ఎన్నికల సందర్భంగా ప్రత్యర్థిని మట్టికరిపించేందుకు సొంత మేనిఫెస్టోతో కాంగ్రెస్ పార్టీ తరుపున బరిలోకి దిగి ప్రజల ఆశీస్సులతో భారీ మెజారిటీతో గెలుపొందిన సునితమ్మ తాను ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా గ్రామ ప్రజల సంక్షేమం కోసం తమ కృషి జరుగుతుందని తెలిపారు. సొంత నిధులతో త్వరలో ఇతర హామీల అమలుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో పెళ్లి

# అన్ని వసతులతో నూతన కోర్టు భవన సముదాయం

**కక్షిదారులకు సత్వర న్యాయం సౌలభ్యాలు - రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరిష్ కుమార్ సింగ్**

**సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నూతన కోర్టు బిల్డింగ్ సముదాయానికి నిర్మాణానికి భూమి పూజ**

**వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి**

**కార్యక్రమానికి హాజరైన హైకోర్టు న్యాయ మూర్తులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, కలెక్టర్, ఎస్పీ**





**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాప్ రిపోర్టర్ . మీడియా టుడే : మార్చి 07:**

కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు అన్ని వసతులతో నూతన కోర్టు భవన సముదాయాలు నిర్మిస్తున్నామని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరిష్ కుమార్ సింగ్ తెలిపారు. సిరిసిల్లలో సుమారు 5 ఎకరాల విస్తీర్ణంలో రూ.81 కోట్ల 60 లక్షల వ్యయంతో 12 రకాల న్యాయస్థానాలు సెల్లార్తోపాటు టెన్ ప్లస్ టు శైలిలో నిర్మాణానికి శనివారం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించగా, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరిష్ కుమార్ సింగ్ వర్చువల్ విధానంలో శంకుస్థాపన లో పాల్గొనగా, సిరిసిల్లలో హైకోర్టు న్యాయమూర్తి కం జిల్లా కోర్టు పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ ఎన్ తుకారాంజీ, జస్టిస్ కె లక్ష్మణ్, జస్టిస్ విజయసేన్ రెడ్డి, జస్టిస్ నందికొండ నర్సింగరావు, జస్టిస్ ఇవి వేణుగోపాల్, జస్టిస్ పుల్లా కార్తీక్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీ నీరజ, కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్వ మత ప్రార్థనలు చేసి.. శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వర్చువల్ విధానంలో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరిష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. నూతన కోర్టు భవన సముదాయం అన్ని కోర్టుల నిర్వహణకు సరిపోయే విధంగా ఉంటుందని వెల్లడించారు. నూతన కోర్టులో మౌలిక వసతులతోపాటు తగినంత సిబ్బంది ఉండాలని సూచించారు సిరిసిల్ల జిల్లాకు భౌగోళికంగా, పరిపాలన పరంగా ప్రాముఖ్యత ఉందని, వ్యవసాయం జీవనోపాధితో అభివృద్ధి చెందుతున్న జిల్లా అని పేర్కొన్నారు. ఇక్కడ చేనేత పరిశ్రమ ఎంతో ప్రసిద్ధి పొందింది అని పేర్కొన్నారు. నూతన కోర్టు భవన సముదాయంతో కోర్టు కు వచ్చే కక్షి దారులకు సత్వర న్యాయం లభించాలని, ఈ దిశగా న్యాయవాదులు, న్యాయ మూర్తులు సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. జిల్లా కోర్టులో 13 వేల కేసులు పైగా కేసులు పెండింగ్ లో నున్నట్లు తెలిపారు. పెండింగ్ కేస్ ల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ద చూపాలని, సంబంధిత అధికారులు సమన్వయముతో పని చేయాలని ఆదేశించారు.

## న్యాయవ్యవస్థపై విశ్వాసం మరింత బలోపేతం

ఈ నూతన కోర్టు భవన నిర్మాణం ప్రజల్లో న్యాయవ్యవస్థపై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే కొత్త అధ్యాయానికి నాందిగా నిలుస్తుందని హైకోర్టు న్యాయమూర్తి కం జిల్లా కోర్టు పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ ఎన్ తుకారాంజీ పేర్కొన్నారు. రాజ్యాంగం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రతి పౌరుడికి సామాజిక న్యాయం అందేలా న్యాయవ్యవస్థ పని చేయాలన్నారు. ప్రతి పౌరుడు న్యాయస్థానాన్ని ఆశతో, నమ్మకంతో ఆశ్రయించేలా వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నూతన కోర్టు భవనం నిర్మాణం ద్వారా మౌలిక సదుపాయాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రజలకు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా సేవలు అందేలా అవకాశం ఏర్పడుతుందని వివరించారు. ఇది కేవలం ఒక భవనం మాత్రమే కాకుండా రాజ్యాంగ విలువలను కాపాడే న్యాయవ్యవస్థకు ఉన్న నిబద్ధతకు ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. నిష్పక్షపాతం.. నైతిక విలువలు కాపాడడం అత్యంత ముఖ్యమని ఆ దిశగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక న్యాయం, న్యాయ పరిపాలన, సమానత్వం, నాణ్యమైన న్యాయ సేవలు అందేలా న్యాయమూర్తులు, న్యాయవాదులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బార్ సభ్యులు సత్యాన్ని వెలికితీసే బాధ్యతతో పని చేస్తూ ప్రజలకు న్యాయం అందేలా అంకితభావంతో ముందుకు సాగాలని సూచించారు.

## సిరిసిల్ల జిల్లా సంపదకు కేంద్రం, చరిత్రకు నిలయం

రాజన్న సిరిసిల్ల జిల్లా చరిత్ర, సంస్కృతి, పరిశ్రమలతో ప్రసిద్ధి పొందిన ప్రాంతం అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీ నీరజ పేర్కొన్నారు పెద్ద టెక్స్టైల్ పవర్ లామ్ కేంద్రంగా ఎదిగి వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నదని చెప్పారు. సిరిసిల్లను పవర్‌లూమ్ నగరంగా కూడా పిలుస్తారనీ. ఇక్కడ వేలాది మంది నేత కార్మికులు పగలు రాత్రి శ్రమించి దేశవ్యాప్తంగా పేరు పొందిన వస్త్రాలను తయారు చేస్తున్నారని తెలిపారు.సిరిసిల్లలో ఉన్న వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం దేశంలో ప్రసిద్ధి చెందిన పవిత్రక్షేత్రాలలో ఒకటి. ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు ఇక్కడికి వచ్చి స్వామివారిని దర్శించుకుం టారనీ. ఈ ఆలయం ఈ ప్రాంతానికి చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను తెచ్చిపెట్టిందనీ తెలిపారు. సిరిసిల్ల జిల్లా ప్రత్యేకతల్లో నేత కార్మికుల పాత్ర ఎంతో గొప్పదన్నారు. ఇక్కడి నేత కార్మికులు తయారు చేసే చీరలు, పాఠశాల విద్యార్థుల యూనిఫామ్‌లు, ఇతర వస్త్రాలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయని, వేలాది కుటుంబాలు ఈ టెక్స్టైల్ పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని చెప్పారు.అందుకే సిరిసిల్లను చరిత్ర, ఆధ్యాత్మికత, పరిశ్రమలు కలిసిన సంపద నగరంగా పేర్కొంటారని గుర్తు చేశారు. తెలంగాణలో అభివృద్ధి, సంస్కృతి, కార్మికుల కృషికి ప్రతీకగా నిలిచిన సిరిసిల్ల ఒక ముఖ్యమైన జిల్లాగా ప్రఖ్యాతిగాంచిందని పేర్కొన్నారు.

## ల్యాప్ టాప్ లు పంపిణీ..

జిల్లా సంక్షేమశాఖ ఆద్వర్యంలో దివ్యాంగ డిగ్రీ, ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ల్యాప్ టాప్ లు, దివ్యాంగులకు బ్యాటరీ వీల్ చైర్లు, ఎంపవర్ కార్ట్ లు హై కోర్టు న్యాయమూర్తులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, కలెక్టర్, ఎస్పీతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల, విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఇచ్చారు.

## హైకోర్టు న్యాయమూర్తులకు సన్మానం

అనంతరం హై కోర్టు న్యాయమూర్తులను జిల్లా కోర్టులు, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాధ్యులు, జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, అదనపు ఎస్పీ చంద్రయ్య, × వ అదనపు జిల్లా జడ్జి శ్రీమతి.బి.పుష్పలత, పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్, సీనియర్ సివిల్ జడ్జి, సిరిసిల్ల - కమ్ - ఎఫ్ ఏ సి : కార్యదర్శి, డీ ఎల్ ఎస్ ఏ. శ్రీ.పి.లక్ష్మణాచారి, సీనియర్ సివిల్ జడ్జి, వేములవాడ శ్రీ. అజయ్ కుమార్ జాదవ్, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీ.ప్రవీణ్, వేములవాడ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి జ్యోతిర్మయి, సిరిసిల్ల అదనపు జూనియర్ సివిల్ జడ్జిలు శ్రీమతి. కావేటి సృజన, మిస్.గడ్డం మేఘన, సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు జూపల్లి శ్రీనివాసరావు, వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ.గుడిసె సదానందం, డీఎస్పీ నాగేంద్రచారి, తహసీల్దార్ మహేష్ కుమార్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, గవర్నమెంట్ ప్లీడర్స్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా

# మహిళా పోలీసులకు ఘన సన్మానం

**గోదావరిఖని ఏసీపీ కార్యాలయంలో మహిళా సిబ్బందితో వేడుకలు**

**మహిళల సేవలు అభినందనీయం: ఏసీపీ ఎం.రమేష్**




**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్: మీడియా టుడే , మార్చి 07 :**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గోదావరిఖని ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ ఎం. రమేష్ పోలీస్ అధికారులతో కలిసి మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు. అనంతరం మహిళా పోలీస్ అధికారులు, సిబ్బందిని శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఏసీపీ ఎం. రమేష్ మాట్లాడుతూ, మహిళల్లో సంకల్పశక్తి ఎక్కువగా ఉంటుందని, వారు ఏ రంగంలోనైనా గొప్ప విజయాలు సాధించగలరని అన్నారు. దేశంలోని అన్ని రంగాల్లో మహిళలు ఉన్నత స్థానాలకు చేరుకుంటూ పురుషులతో సమానంగా రాణిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలకు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో హక్కులు ఉన్నాయని తెలిపారు.మహిళా అధికారులు తమ పూర్తి శక్తి, సామర్థ్యాలతో విధులు నిర్వహిస్తూ తమ లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. పురుషుల కంటే మహిళల్లో నిబద్ధత ఎక్కువగా ఉంటుందని, పలు విభాగాల్లో మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా సేవలందిస్తున్నారని తెలిపారు.పోలీస్ స్టేషన్లలో రిసెప్షన్ విధులు, కోర్టు డ్యూటీ ఆఫీసర్, రైటర్, పెట్రోలింగ్, బ్లూ కోట్స్, సైబర్ వారియర్స్, పాఠశాలలు మరియు కళాశాలల్లో షీ టీమ్స్ ద్వారా సైబర్ క్రైమ్‌లపై అవగాహన కార్యక్రమాలు, ముఖ్యమైన బందోబస్త్ బాధ్యతలను మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది సమర్థంగా నిర్వహిస్తున్నారని అన్నారు. గృహహింస, వైవాహిక వివాదాల వంటి కేసుల్లో బాధిత మహిళలకు కౌన్సెలింగ్ అందిస్తూ మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని అభినందించారు.మహిళలు పలు రంగాల్లో సాధిస్తున్న విజయాలు రాబోయే తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్న ఏసీపీ, మహిళా అధికారులు ధైర్యంగా ఉండి తమ వృత్తిపరమైన బాధ్యతలను గౌరవంగా నిర్వహించాలని సూచించారు. మహిళా పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, గోదావరిఖని టూ టౌన్ ఇన్స్పెక్టర్ ప్రసాదరావు, రామగుండం ఎస్సై సంధ్యారాణి, రామగిరి ఎస్సై దివ్య, గోదావరిఖని వన్ టౌన్ ఎస్సై అనూష, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏటా 6 ఉచిత గ్యాస్ సిలిండర్లు

**గృహిణులందరికీ నెలకు 2,500.. ఉచిత బస్సు ప్రయాణం**

**తమిళనాడు మహిళలపై విజయ్ హామీల జల్లు**

చెన్నై, మార్చి 7



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధ్యక్షుడు విజయ్ ఆ రాష్ట్ర మహిళలకు భారీగా హామీలు ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ ఘన విజయం సాధించి అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని గృహిణులకు నెలకు రూ. 2500లు ఇస్తామని, ఏటా 6గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తామని, పేద యువతుల పెళ్లికి 8 గ్రాముల బంగారాన్ని అన్నయ్య కానుకగా ఇస్తానని ప్రకటించారు. మహాబలిపురంలోని ఓ స్టార్‌హోటల్‌లో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలో ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి వచ్చాక కామరాజర్ విద్యా సహాయ పథకం కింద 1 నుంచి 12 వరకు నిరాటంకంగా చదివించే తల్లిదండ్రులు లేదా సంరక్షకులకు ఏటా రూ. 15 వేలను ఇస్తామని చెప్పారు. మహిళలకు అన్ని బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామన్నారు.

# కువైట్‌లో చమురు ఉత్పత్తి బంద్

**ఇప్పటికే నిలిపేసిన ఖతర్, ఇరాక్.. మార్కెట్‌లో ప్రకంపనలు!**

**బ్యారెల్‌కు ఒక్క డాలర్ పెరిగినా భారత్‌పై వేల కోట్ల భారం**

**అరేబియా సముద్రంలో స్తంభించిన నౌకాయానం**

**ఎర్ర సముద్రం మీదుగా సరఫరాకు సౌదీతో భారత్ ఒప్పందం**



న్యూఢిల్లీ, మార్చి 7:

అమెరికా, ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం నేపథ్యంలో చమురు ఉత్పత్తిని, ఎగుమతులను నిలిపివేస్తున్నట్లుగా కువైట్ శనివారం ప్రకటించింది. ఇప్పటికే ఖతర్, ఇరాక్ ఈ ప్రకటన చేశాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా చమురు మార్కెట్‌లో తీవ్ర ప్రకంపనలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అరేబియా సముద్రంలో హోర్ముజ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధించడంతో నౌకాయానం స్తంభించిపోయి పలు దేశాల్లో చమురు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇప్పుడు ఏకంగా చమురు ఉత్పత్తే నిలిచిపోతే పరిస్థితి మరింత తీవ్రంగా మారే ప్రమాదం ఉంది. దీని ప్రభావం భారత్ మీద కూడా గణనీయంగా ఉండనుంది. బ్యారెల్‌కు కేవలం ఒక్క డాలర్ పెరిగినా భారత్‌పై రూ.16 వేల కోట్ల అదనపు భారం పడుతుందంటే అతిశయోక్తి కాదు. ఈ నేపథ్యంలోనే, ఉద్రిక్తతలు నెలకొన్న అరేబియా సముద్రం కాకుండా.. ఎర్ర సముద్ర తీరంలోని యాన్బు నుండి చమురు కొనుగోలు చేయడానికి సౌదీ అరేబియాతో భారత్ ఒప్పందం చేసుకుంది. రష్యా చమురు, గ్యాస్ కూడ ఇదే ఎర్ర సముద్రం మార్గం గుండా భారత్‌కు చేరుకొంటుంది. వివిధ దేశాలకు చెందిన ఎల్‌పీజీ ట్యాంకర్లతోపాటు దాదాపు 600 నౌకలు ప్రస్తుతం గల్ఫ్ దేశాలలో నిలిచిపోయాయి. వీటిలో 32 లక్షల (14.2 కిలోల) సిలిండర్లకు సరిపడా గ్యాస్ రవాణా చేసే శివలిక్ నౌక కూడా ఉంది. ఇది ఖతర్‌లో ఆగిపోయింది. ఇది భారతదేశంలో అత్యధిక సామర్థ్యం కలిగిన ఎల్‌పీజీ రవాణా నౌక. హెర్ముజ్ జలసంధి మీదుగా సాధారణంగా నిత్యం 170నౌకలు వెళ్తుండగా యుద్ధం వల్ల వాటి సంఖ్య రెండుకు పడిపోయింది. యుద్ధం కొనసాగితే మరికొన్ని వారాలలోపు చమురు ధర బ్యారెల్‌కు 150 డాలర్లకు చేరుకోవచ్చని ఖతర్ ఇంధన మంత్రి సాద్ అల్ కాబీ చేసిన వ్యాఖ్యాలతో ప్రపంచ మార్కెట్లు ఉలిక్కిపడ్డాయి. శనివారం చమురు ధర బ్యారెల్‌కు 94 డాలర్లకు చేరుకుంది. యుద్ధం మొదలైన వారం రోజుల్లోనే చమురు ధరలు 30 శాతం పెరగటం గమనార్హం. ఎల్‌పీజీ అవసరాలకు భారత్ ప్రధానంగా సౌదీ, ఖతర్‌లపై ఆధారపడుతుండగా ఈ దేశాల్లో ఎల్‌పీజీ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. శనివారానికి ఎల్‌పీజీ ధర టన్నుకు 750డాలర్లకు చేరుకుంది. ఎల్ఎన్‌జీ ధర 35డాలర్లకు చేరుకుంది.

# గల్ఫ్ నుంచి 52,360 మంది రాక

**280 విమానాల్లో తరలింపు : డీజీసీఏ**



న్యూఢిల్లీ, మార్చి 7: గల్ఫ్ దేశాల నుంచి శుక్రవారం అర్ధరాత్రి వరకు 52,360 మందిని భారత్‌కు తరలించినట్లు డీజీసీఏ తెలిపింది. ఇందుకు భారత విమానయాన సంస్థలు 184 విమానాలు, యూఏఈ విమానయాన సంస్థలు 85 విమానాలు నడపగా, 11 ప్రత్యేక విమానాలు ఉపయోగించారు. యూఏఈలో రెగ్యులర్ విమానాల షెడ్యూళ్లను రద్దు చేసినందున భారత విమానయాన సంస్థలు అందుబాటులోకి వచ్చిన స్లాట్లను బట్టి ప్రత్యేక విమానాలను నడుపుతున్నాయి. కాగా దుబాయి ఎయిర్‌పోర్ట్‌ను శనివారం ఉదయం మూసివేశారు. ఈ ఎయిర్‌పోర్ట్‌కి వచ్చే, వెళ్లే అన్ని విమానాలను రద్దు చేసినందున అక్కడికి రావొద్దని ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ శనివారం ఉదయం 'ఎక్స్'లో పేర్కొంది.

# కోల్‌బెల్ట్ ఏరియాలో ప్రజా సేవలో రాణిస్తున్న మహిళలు

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి తేళ్ల విజయ్ / మీడియా టుడే మార్చి 7 2026:**

ఆమె.. ఆకాశంలో సగం. అనురాగంలో ఘనం. అన్ని బంధాలకు ఆదిమూలం. ఒకప్పుడు వంటి ఇంటికే పరిమితమైన ఆమె.. ఇప్పుడు నేల నుంచి నింగి వరకూ చేయలేని పనిలేదు. చేతకాని పనీ లేదు. కండబలంలో తక్కువ అయినా.. బుద్ధిబలంలో మగవారికంటే ఎన్నో రెట్లు ఎక్కువగా నిరూపించుకుంది.

అయినా ఆమెపై అసమానతలు రోజురోజుకూ పెరుగుతున్నదీ నిజం. ఇవాళ మహిళా దినోత్సవం. అంటే అమ్మల రోజు కూడా అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళా మణులందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలో వివిధ రంగాల్లో ప్రజాసేవ చేస్తున్న మహిళ మణుల మనోభావాలను తెలుపుతూ వారి మాటలు..

### వంటింటికే పరిమితం కాకుండా శక్తిని చాటి చెప్పాలి



**వేముల మౌనిక, అసిస్టెంట్ ఇంజనీర్ ట్రాన్స్కో ఊరు మందమర్రి.**

అనాది నుంచే మహిళపై అణచివేత ఉంది. మనిషిగా కాక వస్తువులా చూసిన చరిత్రా ఉంది. మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళ తన శక్తిని పెంచుకున్నది. మగవారికి సమానంగా సత్తా చాటుతున్నది. అయినా ఆమెపై వివక్ష తగ్గలేదు. గౌరవం పెరగలేదు. మగవారికి సమానంగా కష్టపడినా సమాన వేతనం ఇవ్వలేదు. ఇదేమనే ప్రశ్న నుంచే ఆమె శక్తి ఈ లోకానికి తెలియడం మొదలైంది. అందుకే మహిళలు వంటింటికే పరిమితం కాకుండా శక్తిని చాటి చెప్పాలి

### మహిళలు అన్ని పాత్రలోనూ అగ్రగామిగా ఎదగాలి



**లావుడ్యా లైలా, జూనియర్ లెక్చరర్, సింగరేణి జూనియర్ కాలేజ్ మందమర్రి**

"అమ్మవారికి ఎన్నో రూపాలు ఉన్నట్లే, మహిళ జీవితంలో కూడా ఎన్నో బాధ్యతలతో అనేక రూపాలను దాల్చుతుంది. కుటుంబాన్ని ప్రేమతో నడిపిస్తూనే... సమాజంలో బాధ్యతగల డాక్టర్‌గా, ఉపాధ్యాయురాలిగా, సైంటిస్ట్‌గా, నాయకురాలిగా తన ప్రతిభను చూపుతోంది. వారి సామర్థ్యాన్ని తక్కువగా అంచనా వేయకుండా, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసేందుకు తగిన పరిస్థితులను కలిగించినప్పుడే నిజమైన మార్పు సాధ్యమవుతుంది

### అసమానతలు తొలిగి మహిళల ప్రాధాన్యత పెరగాలి



**మిట్టపల్లి సుమతి, డిప్యూటీ ఇంజనీర్ మందమర్రి మున్సిపాలిటీ**

"మానవ జాతి మనుగడకే ప్రాణం పోసింది మగువ. త్యాగంలో అనురాగంలో తరగని పెన్నిధి మగువ. మహిళ అంటే మానవతామూర్తి.. మహోన్నత భావాలున్న శక్తి. తెగువలోనూ మగువది చరిత్రలో సుస్థిర స్థానమే. ఆమెను ఆకాశంలో సగం అన్నారు. కానీ అది ఆచరణలో మాత్రం జరగడం లేదు. సామర్థ్యంలో అత్యున్నతం అయినా.. సమానత్వంలో అత్యల్పం. ఈ అసమానతలు తొలిగి మహిళల ప్రాధాన్యత పెరగాలి"

### మహిళ సమాజం కోరుకునేది ఆత్మగౌరవం



**ములకలపల్లి మంజుల వాణి,**
**టీచర్, మనోవికాస్ పాఠశాల మందమర్రి**

మహిళా దినోత్సవం అంటే మనకు రక్తం పంచిన వారి రోజు. ఒక స్త్రీగా మన జీవితానికి అన్నీ అయ్యి.. ఎన్నో విధాలుగా ముందుకు నడిపిస్తోన్న ఆ మహిళ సమాజం నుంచి కోరుకునేది ఏంటో తెలుసా..? వారి ఆత్మగౌరవానికి భంగం కలగనివ్వని గౌరవం.. ఆత్మాభిమానాన్ని తగ్గించని నమ్మకం.. ఆ రెండూ మనం వారికి ఇవ్వాలి.. ఆకాశంలో కాదు.. ఈ నేలపైనా మాకు సగం ఇచ్చి, అనునిత్యం బాసటగా ఉండాలని కోరుతున్నాను"

### ప్రాంతీయ ఉద్యమాల నుంచి ప్రపంచ రాజకీయాల వరకూ స్త్రీలు ఎదగాలి



**కందిరి మానస, వైద్యాధికారిణి,మందమరి ప్రభుత్వ ఆసుపత్రి**

"ప్రాంతీయ ఉద్యమాల నుంచి ప్రపంచ రాజకీయాల వరకూ స్త్రీకి తెలియని విషయం ఏదీ లేదిప్పుడు. ఒకప్పుడులా పేరెంట్స్ ఏం చెబితే అది కాకుండా.. తను స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోగలదు. తన ఆత్మవిశ్వాసానికి ఏ భంగం లేకుండా తన కాళ్లపై తను నిలబడగలదు.. ఈ దిశగా మహిళలంతా మనోధైర్యంగా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుకుంటున్నాను"

### సమానం అనే భావనతో కూడిన సమాజం రావాలి

**కందారపు కళావతి,**

**పండ్ల వ్యాపారి ,మందమర్రి మార్కెట్**



"అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ప్రతి మహిళకు మనం తెలపాల్సింది కేవలం శుభాకాంక్షలు మాత్రమే కాదు. సమాన హక్కులను కల్పిస్తూ అందరూ సమానమనే భావనతో కూడిన సమాజాన్ని నిర్మించడానికి మనవంతు కృషి చేయడం. ఇదే మనందరి గురుతర బాధ్యత"

# స్త్రీలను గౌరవించడం మనందరి బాధ్యత

**మున్సిపల్ చైర్మన్ కట్కం రవి**

**విజ్ డమ్ హై స్కూల్ లో ఘనంగా ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు**




**రాయికల్: మీడియా టుడే:మార్చి 7:**

స్థానిక విజ్డం ఉన్నత పాఠశాలలో శనివారం రోజు ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించడం జరిగింది. విద్యార్థినిలు సమాజంలో మహిళలు, ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు వివిధ రకాల వేషధారణలతో, నృత్యాలతో కళ్ళకు కట్టినట్టు చూపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాయికల్ మున్సిపల్ నూతన రెండవ కార్యవర్గం హాజరయ్యారు.ఈ కార్యక్రమం లో పాఠశాల కరెస్పాండెంట్ ఎద్దండి ముత్యంపు రాజు రెడ్డి మాట్లాడుతూ,మహిళా సాధికారతే లక్ష్యంగా ఉన్న మన దేశంలో మన రాయికల్ మున్సిపాలిటీ లో 12 కౌన్సిలర్ స్థానాల్లో 7 మంది మహిళలు ఉండడం నిజమైన మహిళా సాధికారత అని, ప్రతి మగవారి విజయం వెనుక మహిళ ఉంటుందనేది నా నిజజీవిత అనుభవమని,మహిళల గౌరవం, సమానత్వం మరియు హక్కులను కాపాడటం మనందరి బాధ్యత అని,మహిళలు కుటుంబానికి, సమాజానికి పునాది అన్నారు.వారి ప్రేమ, త్యాగం, ధైర్యం మరియు కృషి సమాజ అభివృద్ధికి మార్గదర్శకమని అన్నారు.మున్సిపల్ చైర్మన్ కటుకం రవి మాట్లాడుతూ తన చిన్నతనం నుండి ఎన్నో కష్టాలను ధైర్యంగా ఎదుర్కొని ఇప్పుడు ప్రజలకు సేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చానని, తన ఒడిదుడుకుల జీవిత ప్రయాణం లో తన భాగస్వామి పాత్ర అనిర్వచనీయమని అన్నారు. స్త్రీలను గౌరవించడం మనందరి బాధ్యత అని అన్నారు. వైస్ చైర్పర్సన్ తురగ సౌజన్య శ్రీధర్ రెడ్డి మహిళ వార్డు కౌన్సిలర్ లు తోపారపు ప్రశాంతి, కూనారపు మానస భూమేష్,వేముల మౌనిక రాము,ఎలిగేటి లతిక అనిల్, బత్తిని మహేశ్వరి నాగరాజు మచ్చ గంగ లక్ష్మీలు పాల్గొని వారి జీవితాల్లో మహిళలు గా ఎదురుకున్న సమస్యలు, వాటిని అధిగమించే సూచనలు, విద్యార్థులు వారి జీవితాల్లో నిర్దేశించుకోవాల్సిన లక్ష్యాలను గురించి వివరించారు.ప్రత్యేక అతిథిగా విచ్చేసిన జిల్లా వైద్య నిపుణురాలు డాక్టర్ శ్వేత చొల్లంకి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత పాఠశాలలోనే మీ లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాకారం కోసం ప్రయత్నం చేయాలన్నారు. చిన్న బెల్లాల్ సర్పంచ్ బొంతల లక్ష్మి భూమన్న పాల్గొని మహిళల యొక్క గొప్పతనం ఉదయం నుండి రాత్రి వరకు వారు పడే కష్టాలను గురించి వివరించారు.మున్సిపల్ కౌన్సిలర్ లను,మహిళా ఉపాధ్యాయులను, కర్మచారినుల ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల డైరెక్టర్ నివేదిత రెడ్డి, వార్డ్ కౌన్సిలర్లు భూక్య రాకేష్ నాయక్, పుర్రె శ్రీధర్,ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహం గా పాల్గొన్నారు.






# జీహెచ్ఎంసీ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

**ఖైరతాబాద్ జోన్‌లో పారిశుధ్య పరిస్థితులపై సమీక్ష - చెత్త పేరుకుపోయే ప్రాంతాలను తొలగించాలని ఆదేశాలు**

**ఎంఎల్ఏ కాలనీలో ఖాళీ స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేయాలని సూచన**



హైదరాబాద్, 7 మార్చి

జీహెచ్ఎంసీ పరిధిలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచేందుకు అమలు చేస్తున్న 99 రోజుల "ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పరిస్థితులు, పౌర సేవల నిర్వహణపై సమీక్ష చేపట్టారు. ఖైరతాబాద్ జోన్ కమిషనర్ ప్రియాంక ఆలాతో కలిసి జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బంజారాహిల్స్‌లోని అపోలో ఆస్పత్రి సమీపంలో ఉన్న ఎన్‌బీటీ నగర్, జివిపి ప్రాంతాల్లో పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. అక్కడ చెత్త పేరుకుపోయే ప్రాంతాలను పూర్తిగా తొలగించి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. చెత్త పేరుకుపోయే సున్నిత ప్రాంతాలను గుర్తించి వాటిని పూర్తిగా నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఖైరతాబాద్ జోన్ పరిధిలోని జూబ్లీహిల్స్ సర్కిల్‌లో జరుగుతున్న పారిశుధ్య పనులను కూడా కమిషనర్ సమీక్షించారు. చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణ, వీధుల పరిశుభ్రత వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. నగరంలో పరిశుభ్రతను మెరుగుపరచేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఇక ఎంఎల్ఏ కాలనీలో ఉన్న ఖాళీ స్థలాన్ని కూడా కమిషనర్ పరిశీలించారు. ఆ స్థలాన్ని ప్రజలకు ఉపయోగపడేలా పార్కుగా అభివృద్ధి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రజలకు విశ్రాంతి, వినోదం కల్పించేలా పచ్చదనంతో కూడిన పార్కును అభివృద్ధి చేయాలని సూచించారు. 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమం కింద నగరంలో పారిశుధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని కమిషనర్ అధికారులకు సూచించారు. చెత్త పేరుకుపోయే ప్రాంతాలను పూర్తిగా తొలగించి నగర పరిశుభ్రతను మెరుగుపరచేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

# వికలాంగ అభిమాని ప్రేమకు జగన్ స్పందన

**ప్రొద్దుటూరులో హృదయాన్ని కదిలించిన ఘటన - అభిమానిని గుర్తించి తాడేపల్లికి పిలవాలని ఆదేశం**

**ఆటో డ్రైవర్ మహబూబ్ బాషాకు భరోసా ఇచ్చిన రాచమల్లు**

ప్రొద్దుటూరు, 7 మార్చి

రాచమల్లు శివప్రసాద్ రెడ్డి కుమార్తె రిసెప్షన్ కార్యక్రమం సందర్భంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రొద్దుటూరు పర్యటనలో హృదయాన్ని కదిలించే ఘటన చోటుచేసుకుంది. హెలిప్యాడ్ నుంచి రిసెప్షన్ వేదికకు వెళ్తున్న సమయంలో ఒక వికలాంగ అభిమాని కాన్వాయ్ వెంట ఎంతో కష్టపడి పరుగెత్తుకుంటూ వస్తున్నాడని జగన్ గమనించారు. ఆ అభిమాని చూపించిన ప్రేమ, అభిమానాన్ని చూసి వెంటనే స్పందించిన ఆయన, అతన్ని తప్పకుండా గుర్తించి తాడేపల్లికి పిలిపించాలని రాచమల్లు శివప్రసాద్ రెడ్డికి సూచించారు. జగన్ ఇచ్చిన ఆదేశాల మేరకు రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఆ అభిమానిని వెతికి కనుగొన్నారు. అనంతరం అతన్ని తన ఇంటికి పిలిపించుకుని అతని క్షేమ సమాచారాన్ని తెలుసుకున్నారు. ఆ సమయంలో అతని పేరు మహబూబ్ బాషా అని, తాను ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నట్లు తెలిసింది. జగన్ తనను గుర్తించి పిలవాలని చెప్పిన విషయం తెలియడంతో అతను ఆనందం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా రాచమల్లు శివప్రసాద్ రెడ్డి జగన్ పంపిన సందేశాన్ని మహబూబ్ బాషాకు తెలియజేశారు. తానే స్వయంగా అతన్ని తాడేపల్లికి తీసుకెళ్లి జగన్‌తో కలిసేలా చేస్తానని హామీ ఇచ్చారు. తన అభిమాన నాయకుడిని ప్రత్యక్షంగా కలుసుకునే అవకాశం వస్తుందని తెలిసిన మహబూబ్ బాషా ఆనందంతో భావోద్వేగానికి గురైనట్లు తెలిపారు. ఈ ఘటన నాయకుడిపై ఒక సాధారణ అభిమాని చూపించే నిజమైన ప్రేమ, అనుబంధానికి ఉదాహరణగా నిలిచింది. జగన్ స్పందనతో మహబూబ్ బాషాకు కలిగిన ఆనందం అక్కడ ఉన్న వారిని కూడా కదిలించింది. ఈ సంఘటన ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.



# తిరుపతిలో మైనర్ బాలికపై లైంగిక దాడి

**11 ఏళ్ల బాలికపై దారుణ ఘటన- నిందితుడిపై పోక్సో కేసు నమోదు**

**పరారీలో ఉన్న ట్రాక్టర్ డ్రైవర్ కోసం గాలింపు**



తిరుపతి, 7 మార్చి

తిరుపతి నగరంలో మైనర్ బాలికపై లైంగిక దాడి జరిగిన ఘటన తీవ్ర ఆందోళనకు దారి తీసింది. ఇంటిలో ఒంటరిగా ఉన్న 11 ఏళ్ల బాలికపై ట్రాక్టర్ డ్రైవర్ లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై తిరుచానూరు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒక మహిళ తన మొదటి భర్తతో పుట్టిన 11 ఏళ్ల కుమార్తెతో కలిసి నివసిస్తోంది. అనంతరం ఆమె ఓ ట్రాక్టర్ డ్రైవర్‌ను రెండో వివాహం చేసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇంటిలో ఒంటరిగా ఉన్న బాలికపై ఆ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ ఘటన గురించి తెలిసిన వెంటనే బాలిక తల్లి తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. బాలికను వైద్య పరీక్షల కోసం తిరుపతిలోని రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన అనంతరం నిందితుడు పరారైనట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు వెలుగులోకి రావడానికి దర్యాప్తు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

# ముఖ్యమంత్రి సమక్షంలో 130 మంది మావోయిస్టుల లొంగుబాటు

**- ఆయుధాలతో పోలీసులకు లొంగిపోయిన మావోయిస్టులు**

**- హింసకు పరిష్కారం లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం - లొంగిపోయిన వారికి పునరావాసం, రక్షణ హామీ**



హైదరాబాద్, 7 మార్చి

ప్రజా సమస్యలకు ఆయుధాలు, హింస ద్వారా పరిష్కారం దొరకదని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు ఆయుధాలను విడిచిపెట్టి జనజీవన ప్రవంతిలోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపునకు స్పందిస్తూ హైదరాబాద్‌లోని ఐసీసీసీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సమక్షంలో 130 మంది మావోయిస్టులు పోలీసులకు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక రీజినల్ కమిటీ సభ్యుడు, పది మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 46 మంది ఏరియా కమిటీ సభ్యులు, 70 మంది పార్టీ సభ్యులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వారు తమ వద్ద ఉన్న 124 అత్యాధునిక ఆయుధాలను కూడా పోలీసులకు అప్పగించారు. ఒకేసారి ఇంత పెద్ద సంఖ్యలో ఆయుధాలతో లొంగిపోవడం ఇదే తొలిసారి అని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పిలుపును నమ్మి ముందుకు వచ్చిన మావోయిస్టులు జనజీవనంలోకి కలవడం శుభపరిణామమన్నారు. లొంగిపోయిన వారి ప్రాణాలకు ఎలాంటి హాని కలగకుండా వారికి రక్షణ కల్పిస్తామని తెలిపారు. సాధారణ జీవితం గడపడానికి అవసరమైన ఆర్థిక సహాయం, ఇతర వసతులను ప్రభుత్వం అందిస్తుందని హామీ ఇచ్చారు. మహాత్మా గాంధీ శాంతియుత పోరాటంతో దేశానికి స్వాతంత్ర్యం సాధించిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. ఎంత పెద్ద సమస్య అయినా చర్చల ద్వారానే పరిష్కారం సాధ్యమని ఆయన అన్నారు. ఇటీవల లొంగిపోయిన మావోయిస్టు నాయకులు దేవ్ జీ, దామోదర్, రాజిరెడ్డి, చంద్రన్న తదితరులు తమ పునరావాసానికి సంబంధించిన ప్రతిపాదనలు తనకు తెలియజేశారని తెలిపారు. మావోయిస్టుల లొంగుబాటు, పునరావాసం విషయంలో తెలంగాణ ప్రభుత్వం మానవీయ కోణంలో వ్యవహరిస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 2024 జనవరి నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో మొత్తం 721 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు తెలిపారు. లొంగిపోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లతో పాటు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. అవసరమైతే కేసుల పరిశీలన కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తామని సీఎం వెల్లడించారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు ఆయుధాలు వదిలి లొంగిపోతే వారికి పూర్తి సహకారం అందిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు చెక్కులను ముఖ్యమంత్రి అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, అదనపు డీజీ విజయ్ కుమార్, ఐజీ సుమతి తదితర అధికారులు పాల్గొన్నారు.

# మహిళల రక్షణకు పురుషులే బ్రాండ్ అంబాసిడర్లు కావాలి

**సీఎం రేవంత్ రెడ్డి**

**- జేఎన్‌టీయూ క్యాంపస్‌లో 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమం ప్రారంభం**

**- మహిళల భద్రత సామాజిక బాధ్యతగా భావించాలని పిలుపు**

**- ఆర్థిక స్వావలంబన కోసం పలు పథకాలు అమలు**



హైదరాబాద్, 7 మార్చి

సమాజంలో మహిళల రక్షణ కోసం పురుషులే బ్రాండ్ అంబాసిడర్లుగా నిలబడాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మహిళలపై వేధింపులు జరిగినప్పుడు చూసి చూడనట్టు ఉండటం కూడా నేరాన్ని ప్రోత్సహించడమేనని ఆయన అన్నారు. హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ క్యాంపస్ ఆడిటోరియంలో తెలంగాణ పోలీస్ మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన "స్టాండ్ విత్ హర్" కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా "స్టాండ్ విత్ హర్" క్యాంపెయిన్ బ్రోచర్‌ను ఆవిష్కరించిన సీఎం మహిళల భద్రత, గౌరవం, సమానత్వాన్ని కాపాడడంలో పురుషులు బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలని సూచించారు. ఆడపిల్లలను ఎవరైనా ఇబ్బందికి గురిచేస్తే వెంటనే నిలబడి ప్రశ్నించే తత్వాన్ని యువత అలవర్చుకోవాలని ఆయన తెలిపారు. కుటుంబ సభ్యులకు ఎక్కడైనా వేధింపులు ఎదురైతే ఎలా స్పందిస్తామో ఇతర మహిళల విషయంలోనూ అదే విధంగా స్పందించాలని ఆయన అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి, మహిళలను శక్తితో పోల్చుకుంటున్నప్పటికీ వారు భయాందోళనల మధ్య జీవించే పరిస్థితులు ఉండకూడదన్నారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా బలోపేతమైతేనే రాష్ట్రం లేదా దేశం నిజమైన పురోగతి సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో మహిళల భద్రతతో పాటు వారి ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, వడ్డీలేని రుణాలు వంటి పథకాలను మహిళల పేరుమీదే అందిస్తున్నామని సీఎం తెలిపారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, ఆర్టీసీ బస్సుల యాజమాన్యంలో మహిళలకు అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయించేందుకు అమెజాన్ వంటి సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నామని వెల్లడించారు. ప్రస్తుతం భౌతిక నేరాల కంటే ఆన్‌లైన్ నేరాలు పెరుగుతున్నాయని సీఎం పేర్కొన్నారు. డీప్ ఫేక్ వీడియోలు వంటి సైబర్ నేరాలను అరికట్టేందుకు తెలంగాణ సైబర్ క్రైమ్ విభాగాన్ని బలోపేతం చేశామని తెలిపారు. ఏదైనా ఘటన జరిగితే మహిళలపైనే నిందలు మోపే చెడు సంప్రదాయాన్ని సమాజం విడిచిపెట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎం మాజీ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, మహిళా భద్రత విభాగం అదనపు డీజీపీ చారు సిన్హా, సినీ నటుడు సాయి ధరమ్ తేజ్, ఉన్నతాధికారులు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు. మహిళల భద్రత కోసం ప్రతి ఒక్కరూ "స్టాండ్ విత్ హర్" నినాదంతో ముందుకు రావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

# కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం వ్యాఖ్యలు

**అబద్ధం హరీశ్ రావు**

**- వరద కాలువలో ప్రవహిస్తున్న నీళ్లపై ప్రశ్నలు**

**- గాయత్రి పంప్ హౌస్ మోటార్లు నడుస్తున్నాయన్న మాజీ మంత్రి**

**- ప్రాజెక్టుపై తప్పుదారి పట్టించే ప్రచారం చేస్తున్నారని విమర్శ**



హైదరాబాద్, 7 మార్చి

కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే చెబుతున్న వ్యాఖ్యలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ఖండించారు. ప్రాజెక్టుపై అసత్య ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆయన విమర్శించారు. హరీశ్ రావు మాట్లాడుతూ ప్రస్తుతం వరద కాలువలో పారుతున్న నీళ్లు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా వచ్చినవే కాదా అని ప్రశ్నించారు. ప్రాజెక్టు పనిచేయకపోతే ఈ నీరు ఎలా వస్తుందని ఆయన నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని గాయత్రి పంప్ హౌస్ మోటార్లు నడుస్తున్నందువల్లే ఈ నీరు ప్రవహిస్తున్నదని తెలిపారు. ప్రాజెక్టు పనితీరును ప్రజల ముందు తప్పుగా చూపించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్రానికి కీలకమైన సాగునీటి వనరుగా నిలుస్తోందని ఆయన అన్నారు. ప్రాజెక్టుపై రాజకీయ విమర్శలు చేయకుండా వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని హరీశ్ రావు సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు నీరు అందుతోందని ఆయన పేర్కొన్నారు.



# నా కల నిజమైంది

కన్నడ సొగసరి రుక్మిణి వసంత్‌కు కెరీర్‌లో బ్రేక్ రావడానికి కాస్త సమయం పట్టింది. అయితే రెండేళ్ల క్రితం వచ్చిన కన్నడ చిత్రం 'సప్తసాగరాలు దాటి' ఆమె సినీ ప్రయాణాన్ని పూర్తిగా మలుపు తిప్పింది. ఈ చిత్రంలో ఆమె అభినయానికి మంచి ప్రశంసలు దక్కాయి. దాంతో వరుస అవకాశాలు వెల్లువెత్తాయి. ఇప్పుడీ భామ చేతిలో ఉన్నవన్నీ భారీ చిత్రాలే. 'కాంతార చాప్టర్–1'లో ఈ భామ కనకావతి అనే పాత్రను పోషిస్తున్నది. ఇటీవలే ఆమె ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. తాజా ఇంటర్వ్యూలో 'కాంతార చాప్టర్–1' సినిమా గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది రుక్మిణి వసంత్. చిత్ర హీరో, దర్శకుడు రిషబ్‌శెట్టి సినిమా కోసం తనను సంప్రదించినప్పుడు ఆనందానికి అవధులు లేకుండా పోయానని, తన కల నిజమైందనే భావన కలిగిందని రుక్మిణి వసంత్ పేర్కొంది. "కాంతార చాప్టర్–1' నా కెరీర్‌లో చాలా ప్రత్యేకం. చిత్రబృందం కోరిక మేరకు సినిమాలో నేను నటిస్తున్న విషయం కానీ, నా పాత్ర గురించి కానీ ఎక్కడా మాట్లాడలేదు. ఆ విషయాన్ని ఓ రహస్యంగా దాచి ఉంచాను. కొద్ది రోజుల క్రితమే విడుదలైన ఫస్ట్‌లుక్‌తో నా పాత్ర గురించి అందరికీ తెలిసింది' అని రుక్మిణి వసంత్ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ భామ తెలుగులో ఎన్టీఆర్ సరసన 'డ్రాగన్' చిత్రంలో నటిస్తున్నది. తమిళంలో 'మదరాసి', కన్నడంలో యష్ 'టాక్సిక్'లో నాయికగా నటిస్తున్నది.



# దిండు మారితే కలత నిద్రే..

శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీ కపూర్ ఎక్కడికెళ్లినా తనతోపాటు ఓ దిండుని కూడా తీసుకెళ్తుంటారు. ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారిన సందర్భాలు చాలా ఉన్నాయి. అసలు జాన్వీ తనతోపాటు దిండును తీసుకెళ్లడానికి ఏమైనా ప్రత్యేకమైన కారణాలున్నాయా? అనే అంశంపై పలు కథనాలు కూడా వెలువడ్డాయి. రీసెంట్‌గా ఈ విషయంపై జాన్వీ స్పందించారు. 'నాకు పిల్లో ఫోబియో ఉంది. నా షూటింగులు రకరకాల ప్రదేశాల్లో జరుగుతుంటాయి. ఒక్కోసారి నైట్ అక్కడే స్టే చేయాల్సొస్తుంది. అలాంటి సందర్భాల్లో ఏ దిండు పడితే ఆ దిండును తలకింద వేసుకొని పడుకోలేను. కేవలం నా దిండుపై పడుకుంటేనే నాకు నిద్ర వస్తుంది. దిండు మారితే ఇక ఆ రాత్రంతా కలత నిద్రే. అందుకే తోడుగా దిండు తీసుకెళ్తుంటా. ఈ ఫోబియా నా చిన్నప్పట్నుంచీ ఉంది. ఇందులోంచి బయట పడేందుకు చాలాసార్లు ప్రయత్నించా. ప్రయత్నించిన ప్రతిసారీ నిద్రకు దూరమయ్యా.' అంటూ వాపోయారు జాన్వీ కపూర్. ఇక ఈ స్టేట్‌మెంట్ విన్న నెటిజన్లు.. 'కొత్త దిండు కొనుక్కోవచ్చుగా?', 'నీ ప్రొడ్యూసర్లు కొత్త దిండ్లు కూడా కొనలేరా?' అంటూ కామెంట్లు పెట్టేస్తున్నారు.



## అందరు యాక్టర్లతో
# కలిసి కనిపిస్తా..

చాలా మంది స్టార్లున్న సినిమాలో భాగం కావడం, వారితో స్క్రీన్ షేర్ చేసుకోవడం చాలా థ్రిల్లింగ్‌గా ఉందని చెప్పింది. అంతేకాదు కూలీ ఆసక్తికర కథనంపై ప్రశంసలు కురిపించింది. హై ఆక్టేన్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో ఆసక్తికరమైన కథలో కీలకంగా సాగేలా ఉండబోతుందన్నది. ఇక లోకేశ్ కనగరాజ్ ఇంటెన్స్ స్టోరీ టెల్లింగ్, తలైవా స్క్రీన్ ప్రెజెంటేషన్ కూలీని బిగ్గెస్ట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా నిలుపబోతున్నాయని ఇప్పటివరకు వచ్చిన అప్‌డేట్స్ చెబుతున్నాయి. గోల్డ్ అక్రమ రవాణా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో సత్యరాజ్, మహేంద్రన్, అక్కినేని నాగార్జున, మంజుమ్మెల్ బాయ్స్ ఫేం సౌబిన్ షాహిర్‌కీలక పాత్రలు

# ఆత్మగౌరవాన్ని అక్కడ వెతకొద్దు

అందానికి పర్యాయపదం ఐశ్వర్యారాయ్ అనేవారు ఒకనాటి యువత. ఇప్పుడు ఆమెలో పరిపూర్ణత కనిపిస్తున్నది. ఆమె మాటల్లో భావితరాలపై బాధ్యత వినిపిస్తున్నది. రీసెంట్‌గా సోషల్ మీడియా వినియోగం గురించి ఆమె అద్భుతంగా మాట్లాడారు. 'సోషల్ మీడియాలో వచ్చే లైక్స్, కామెంట్లు, షేర్లు మనలోని ఆత్మవిశ్వాసాన్ని ప్రపంచానికి చూపవు. నా దృష్టిలో సాంఘిక మాధ్యమానికి, మానసిక వత్తిడికి మధ్య పెద్ద తేడా లేదు. వయసుతో నిమిత్తం లేకుండా అందరూ ఈ మహమ్మారికి బానిసలవుతున్నారు. ఒక తల్లిగా నాకు ఈ విషయంపై ఆందోళనగా ఉంది. దయచేసి ఆత్మగౌరవాన్ని సామాజిక మాధ్యమాల్లో వెతకొద్దు.. అది కచ్చితంగా అక్కడ దొరకదు. దాన్ని దాటి ప్రపంచాన్ని గమనించండి. అప్పుడు తెలుస్తుంది ఆత్మగౌరవం అంటే ఏంటో. ఆత్మవిశ్వాసంలోనే ఉంటుంది నిజమైన అందం. దాన్ని ఎక్కడో వెతక్కండి. అది మనలోనే ఉంటుంది.' అంటూ చెప్పుకొచ్చారు ఐశ్వర్యారాయ్.



Printed, Published, Editor and owned by K.Koteshwar Rao, Ph.9052477378,#6-1-106, 1st Floor, shop No. 13&14&, near Post office Khairatabad, Hyderabad-04, T.S. RNI No. APTEL/2013/54465, Volme: 12, Issu:103